డిసెంబర్ 2014

# LEISA INDIA

## లీసా ఇండియా

తెలుగు ప్రత్యేక ప్రచురణ

***Magazine on Low External Input Sustainable Agriculture***
***Compilation of Selected articles translated into Telugu***

తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసే సుస్థిర వ్యవసాయ పత్రిక
తెలుగులోకి అనువదించిన కొన్ని వ్యాసాల సంకలనం



# లీసా ఇండియా
**డిసెంబర్ 2014, సంచిక 3**

ఈ సంచికలో వ్యాసాలు లీసా ఇండియా పత్రికలో ప్రచురితమైన ఆంగ్ల వ్యాసాల నుండి ఎంపిక చేయబడ్డవి.

**ఎ.యమ్.ఇ. ఫౌండేషన్**
నం. 204, 100 ఫీట్ రింగ్ రోడ్, మూడవ స్టేజ్,
రెండవ ఫేస్, బనశంకరి, బెంగళూరు – 560085
ఫోన్ : +91 080 26699512
+91 080 26699522
ఫ్యాక్స్ : +91 080 26699410
email: amebang@giasbg01.vsnl.net.in

**లీసా ఇండియా** ఆంగ్లంలో లీసా ఇండియా పత్రికను ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ వారు ఇలియా వారి సహకారంతో ప్రచురించుచున్నారు.

**చీఫ్ ఎడిటర్** కె.వి.యస్. ప్రసాద్

**మేనేజింగ్ ఎడిటర్** టి.యమ్. రాధ

**అనువాదం** సుగుణశ్రీ మద్దాల

**అనువాద సమన్వయం** అరుణకుమార్ శివరాయ

**అడ్మినిస్ట్రేషన్** రుక్మిణి జి. జి.

**డిజైన్ లేఔట్** శ్రీ సాయి క్రియేటివ్ డిజైనర్స్, హైదరాబాద్.

**ముద్రణ** స్పాన్ ప్రింట్, బెంగళూరు

**కవర్ ఫోటో** తాడు (మార్కర్) సహాయంతో వరినాటుతున్న మహిళలు

**ఫోటో** ఎ.యమ్.ఇ.ఎఫ్

**లీసా మేగజైన్**
**ఇతర ఎడిషన్లు**
లాటిన్ అమెరికన్, వెస్ట్ ఆఫ్రికన్,
బ్రెజిలియన్ మరియు చైనీస్ ఎడిషన్

**లీసా ఇండియా మేగజైన్**
**ఇతర ప్రాంతీయ ఎడిషన్లు**
హిందీ, ఒరియా, తమిళ్, కన్నడ, మరాఠీ, పంజాబీ



ఈ పత్రిక నందలి అంశములు సాధ్యమైనంత ఖచ్చితత్వాన్ని కలిగి వుండుటకు ఎడిటర్లు అన్ని జాగ్రత్తలను తీసుకోవడం జరిగినది. వ్యక్తిగతంగా వ్రాసిన ఆర్టికల్స్‌కు ఆ రచయితలే బాధ్యత వహించెదరు.

ఈ పత్రికలోని వ్యాసాలను ఫోటోకాపి తీసి మిగతా వారికి ఇవ్వడాన్ని ఎడిటర్స్ ప్రోత్సహిస్తారు.



మిసెరియార్ వారి తోడ్పాటుతో ఎ.యమ్.ఇ.ఎఫ్. వారిచే ప్రచురితం


## లీసా LEISA www.leisaindia.org

లీసా అంటే తక్కువ బాహ్య ఉత్పాదకాలను ఉపయోగించి చేసేటటువంటి సుస్థిర వ్యవసాయం. ఇది సామాజిక మరియు సాంకేతిక పరమైన విషయాలను జోడించి రైతులు పర్యావరణాన్ని పరిరక్షిస్తూ తమ యొక్క ఉత్పాదకత మరియు ఆదాయాన్ని పెంచుకొనుట గురించి పనిచేస్తుంది. లీసా అనునది స్థానిక వనరులను మరియు సహజ ప్రక్రియలను సరియగు విధంగా ఉపయోగిస్తూ అవసరమైతేనే బాహ్య ఉత్పాదకాలు (ఇన్‌పుట్స్) ఉపయోగించుకొనుట గురించి తెలియజేస్తుంది. ఇది స్త్రీ, పురుష రైతులు వారి విజ్ఞానం, నైపుణ్యం, విలువలు, సంస్కృతి మరియు సంస్థల ఆధారంగా సాధికారతను సాధించి భవిష్యత్తును నిర్మించుకొనుట కొరకు ఉపయోగపడుతుంది. అంతేకాక భాగస్వామ్య పద్ధతుల ద్వారా రైతుల మరియు ఇతరుల యొక్క సామర్థ్యాలను పెంపొందించి, మారుతున్న అవసరాలు మరియు పరిస్థితులకనుగుణంగా వ్యవసాయ వృద్ధిని సాధించుట లీసా లక్ష్యం. సాంప్రదాయ మరియు శాస్త్రీయ విజ్ఞాన పద్ధతులను జోడించి విధాన పరమైన నిర్ణయాలను ప్రభావితం చేసి తదుపరి అభివృద్ధికి సరియైన బాటను పరచటం లీసా యొక్క ప్రధాన ఉద్దేశ్యం. లీసా అనునది ఒక భావన, ఒక విధానం మరియు ఒక రాజకీయ సందేశం.

## ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ AMEF www.amefound.org

ఎ.యమ్.ఇ. ఫౌండేషన్ దక్కన్ పీఠభూమిలోని చిన్న, సన్నకారు రైతులతో కలిసి ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను రూపొందించి, విజ్ఞానాన్ని పెంపొందించి, శిక్షణను అందించి, వివిధ అభివృద్ధి సంస్థలను అనుసంధానించి అనుభవాలను పంచుకుంటుంది.


ధర్మకర్తలు
చైర్మన్ : శ్రీ చిరంజీవ్ సింగ్, ఐ.ఎ.ఎస్
సభ్యులు : డా. ఆర్. ద్వారకీనాథ్ , డా. విఠల్ రాజన్, డా. ఎన్. జి. హెగ్డే, ప్రొ॥ వి. వీరభద్రయ్య, డా. ఎం. మహదేవప్ప, డా. టి.ఎం. త్యాగరాజన్, డా. ఎ. రాజన్న
కోశాధికారి : శ్రీ బి.కె. శివరాం
ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ : శ్రీ కె.వి.ఎస్. ప్రసాద్


## మిసెరియార్ MISEREOR www.misereor.org

మిసెరియార్, అభివృద్ధి సహకారానికై 1958లో స్థాపించబడిన జర్మన్ కాథోలిక్ బిషప్పుల సంస్థ. ఈ సంస్థ 50 ఏళ్ళకు పైగా ఆఫ్రికా, ఆసియా మరియు లాటిన్ అమెరికా దేశాలలో దారిద్ర్య నిర్మూలనకు కృషి చేస్తూ ఉన్నది. జాతి, మత, లింగ భేదాలతో నిమిత్తం లేకుండా, అవసరంలో ఉన్న ఏ మనిషికైనా మిసెరియార్ సంస్థ తోడ్పాటు లభిస్తుంది.

పేద ప్రజలు, ప్రతికూల పరిస్థితులలో ఉన్నవారు స్వయంగా చేపట్టే ప్రయత్నాలకు మిసెరియార్ సహాయపడుతుంది. మిసెరియార్ స్థానిక సంస్థలతో - చర్చికి సంబంధించిన సంస్థలతో, ప్రభుత్వేతర సంస్థలతో, సామాజిక ఉద్యమాలతో మరియు పరిశోధనా సంస్థలతో కలిసి పనిచేస్తుంది. లబ్దిదారులతో కలిసి ఈ భాగస్వామ్య సంస్థలు స్థానిక అభివృద్ధి విధానాల రూపకల్పనకు, ప్రాజెక్టుల అమలుకు తోడ్పడతాయి. ఈ విధంగా మిసెరియార్ సంస్థ, తన భాగస్వామ్య సంస్థలతో కలిసి నిరంతరం మారుతున్న సవాళ్ళకు ప్రతిస్పందిస్తుంది.

ప్రియ పాఠకులారా,

ఈ డిసెంబర్ **2014** సంచిక మీకు అందించడం మాకు ఎంతో ఆనందదాయకంగా ఉంది. ఈ సంచికలో, సుస్థిర వ్యవసాయానికి దోహదపడే శ్రీవరి సాగు మరియు సమగ్ర సేద్య వ్యవస్థల వంటి చొరవల గురించి వివరించడం జరిగింది. అంతేకాక, బహుళ పొరలలో కూరగాయలు పెంచడం వంటి నూతన సేద్య పద్ధతులు కూడా ఈ సంచికలో చోటుచేసుకున్నాయి.

సమగ్ర వ్యవస్థల యొక్క ప్రాముఖ్యతనూ, పరిమితిగా ఉన్న వనరులను, ముఖ్యంగా నీటిని పరిరక్షించుకోవలసిన అవసరాన్నీ, నానాటికీ రైతులు గుర్తిస్తున్నారు. వనరులను పరిరక్షించి, దిగుబడిని పెంచే పద్ధతిగా రైతులు శ్రీవరి సాగును గుర్తించినప్పటికీ, శ్రీవరి సాగు విస్తరణకు అనేక సంస్థల సహకారం మరియు విధానపరమైన తోడ్పాటు అవసరమౌతాయి. ఆహార పంటల యొక్క సాంప్రదాయ రకాల పరిరక్షణలో స్థానిక సంస్థలు చేపడుతున్న చొరవలను కూడా మేము గమనిస్తున్నాము. జన్యు వైవిధ్యాన్ని కాపాడే లక్ష్యంతో చిన్నగా మొదలైన 'సేవ్ ద రైస్' (వరిని కాపాడుదాం) అన్న ప్రచారం, ఇప్పుడు ప్రజల మద్దతుతో బలం పుంజుకుంటోంది.

ఈ సంచిక చదవడం మీకు నచ్చుతుందని భావిస్తున్నాము. ఈ వ్యాసాలపై మీ అమూల్యమైన అభిప్రాయాలను మాకు తెలియచేయగలరు. మీ అభిప్రాయాలను, ఆలోచనలను మా వెబ్‌సైట్ మీద కానీ, పోస్టు లేదా ఈ-మెయిల్ (leisaindia@yahoo.co.in) ద్వారా కానీ పంచుకోగలరు. మీ రైతుమిత్రులు ఎవరైనా ఈ పత్రికను చదవాలని మీరనుకుంటే, వారి పూర్తి తపాలా చిరునామా మాకు పంపిస్తే, మేము వారికి ఈ పత్రికను పంపడానికి సంతోషిస్తాము.

మీ అందరికీ నూతన సంవత్సర శుభాకాంక్షలు!

సంపాదకులు




భూమిలో బహుళ పొరలలో కూరగాయల సేద్యం ............ ప్రకాష్ సింగ్...

రైతులు తరచుగా వారి పొలాలలో కొత్త ఆలోచనలను ప్రయత్నం చేస్తూ అనేక స్థానిక సాంకేతిక పరిజ్ఞానాలను నవకల్పనల ద్వారా మరియు కొన్ని మార్పులు చేర్పులు చేయడం ద్వారా అభివృద్ధి చేస్తూవుంటారు. ఈ కొత్త ప్రయత్నాలు, నవకల్పనలు... **4**





శ్రీవరి సాగు విస్తరణలో నేర్చుకున్న పాఠాలు......................టి.ఎం.రాధ

శ్రీవరి సాగు (సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్) ఎక్కువగా జ్ఞానానికి సంబంధించిన, నిరంతరం పరిణామం చెందే పద్ధతి. ఈ పద్ధతి విస్తృతంగా మరియు సుస్థిరంగా వ్యాప్తి చెందాలంటే, పూర్తిగా ఒక విభిన్నమైన పద్ధతి అవసరం. విజ్ఞాన సాధికారత, భాగస్వామ్య ప్రక్రియలు, నిరంతర చేయూత, సంస్థాగత కలయిక మరియు ప్రభుత్వ మద్దతు... **7**





సేంద్రీయంగా ఎదగడం.......................................హరీష్ తివారీ...

రసాయనిక వ్యవసాయ విధానం మీద అతిగా ఆధారపడ్డ కొత్త తరానికి సేంద్రీయ వ్యవసాయాన్ని నేర్పించడంకోసం ప్రపంచం నలుమూలల్లోని యువ వ్యవసాయ నిపుణులను భారతదేశంలోని సేంద్రీయ క్షేత్రాలతో అనుసంధానం చేసే ప్రయత్నం ... **11**





కుటుంబ సేద్య క్షేత్రాలు ఉత్పత్తిదాయకం............... ఆర్. మణికందన్...

ఒక వ్యవస్థలో 'సెల్ఫ్ రిప్లికేటింగ్ సైకిల్స్' (స్వయం ప్రతి సృజనీయ మండలాలు) నెలకొల్పడం ద్వారా వనరులను, కాలాన్ని, శక్తిని సమర్థవంతంగా వినియోగించడం సాధ్యపడుతుంది. మొక్కల మరియు జంతుజాతులను జాగ్రత్తగా ఎంచుకోవడం ... **15**





సాంప్రదాయ వరి పునరాగమనం ............................సీమ జి. ప్రసాద్

సహజ సమృద్ధ అన్న సేంద్రీయ రైతు సంఘం ఒక దశాబ్దం క్రితమే, సుస్థిర వ్యవసాయం గురించిన ఆలోచనలు, విత్తనాలు, పరిజ్ఞానం ఇచ్చిపుచ్చుకోవడానికి ఒక రైతు బృందాన్ని ఏర్పాటు చేసింది. చిన్నగా మొదలైన ఈ బృందం ఇప్పుడు ఒక చైతన్యవంతమైన ... **18**



బహుళ పొరలలో నాటి ఎక్కువ ఉత్పత్తిని పొందడం

# భూమిలో బహుళ పొరలలో కూరగాయల సేద్యం

## అధిక ఉత్పత్తికై చిన్నకారు రైతులు అవలంభించిన కొత్త పద్ధతి

ప్రకాష్‌సింగ్ మరియు జి.సి.ఎస్.నేగి

**రైతులు తరచుగా వారి పొలాలలో కొత్త ఆలోచనలను ప్రయత్నం చేస్తూ అనేక స్థానిక సాంకేతిక పరిజ్ఞానాలను నవకల్పనల ద్వారా మరియు కొన్ని మార్పులు చేర్పులు చేయడం ద్వారా అభివృద్ధి చేస్తూవుంటారు. ఈ కొత్త ప్రయత్నాలు, నవకల్పనలు స్థానిక పర్యావరణ మరియు జీవావరణపరంగా లోతైన జ్ఞానం, మరియు పర్యావరణరీత్యా ఉండే అనుకూలతలను బట్టి ఉంటాయి. భారతదేశంలో ఉత్తరాఖండ్ రాష్ట్రంలో కొద్దిగా ఎత్తైన ప్రదేశంలో ఉండే హిమాలయ ప్రాంతంలోని ఒక గ్రామంలో సన్నకారు రైతులు అభివృద్ధి చేసినటువంటి కూరగాయల సేద్యపు పద్ధతులను ఈ వ్యాసం విశదీకరిస్తుంది.**

భారతదేశంలోని ఉత్తరాఖండ్‌రాష్ట్రంలో కుమావోన్‌ప్రాంతంలో భూమికి 1100 మీటర్ల ఎత్తులో ఉండే మక్రావ్ హిమాలయ కుగ్రామం. ఇక్కడ వ్యవసాయంపైన మరియు సంబంధిత కార్యకలాపాలపైనా ఆధారపడి నివసిస్తూ రమారామి 85 కుటుంబాలు ఉన్నాయి. ఈ గ్రామంలో ఇంచుమించుగా 50 హెక్టార్ల భూమి సేద్యం క్రింద ఉంది. రాగులు, ఊదలు, వరి, గోధుమ మరియు ఆవాలను పండిస్తూ వుండే ఈ భూమి ఇంచుమించు 90 శాతం మేరకు వర్షాధార ప్రాంతంగా వుంటుంది. నీటిపారుదల చేసే ప్రాంతంలో ఉండే చిన్న చిన్న ప్రదేశాలు కూరగాయల సేద్యం క్రింద ఉంటాయి. ఈ గ్రామంలో ఒక్కో కుటుంబానికీ ఉండే వ్యవసాయయోగ్యమైన భూమి సగటున 0.58 హెక్టార్లు. వలసపోయిన కుటుంబాలకు చెందిన వ్యవసాయయోగ్యమైన భూమి నిరుపయోగంగా మిగలకుండా వారి బంధువులచేగానీ లేక వారి చుట్టుపక్కల వారిచే గానీ

సాగుచేయబడుతుంది. ఈ గ్రామానికి రోడ్లు సరిగా ఉన్నందున రవాణా సౌకర్యం మరియు మార్కెట్ అందుబాటు బావుంది.

## నవకల్పనః బహుళ పొరలలో సేద్యం

ఇంచుమించు ఒక శతాబ్దం క్రితం ఈ గ్రామపెద్దలు దాదాపు 5 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న కొంత భూమిని కూరగాయల సేద్యానికి పనికివచ్చే విధంగా అభివృద్ధిచేశారు. అంతకుముందు ఈ భూమి స్థానికంగా అభివృద్ధిచేసిన 'గూల్స్' ద్వారా నీటిపారుదల చేయబడుతూ వుండగా ప్రభుత్వశాఖల/పథకాల సహకారంతో స్టోరేజ్ ట్యాంకులు, నీటిపారుదల కాలువలు ఇప్పుడు చక్కగా నిర్మించబడి ఉన్నాయి. మొదట్లో క్యారట్, బంగాళదుంప, చేమదుంప వంటి కాయగూరలు, ఆకుకూరలు మరియు సుగంధద్రవ్యాలు, ఉదాః బచ్చలికూర, కొత్తిమీర, పసుపు మరియు వెల్లుల్లి వంటివి సాగుచేయబడుతూ ఉండేవి.

చేమదుంపను ఒకే ఒక పంటగా సాంప్రదాయబద్ధంగా పండించే భూములలో మరొకదానిని పంటగా పండించే అవకాశం ఉండేదికాదు. ఈ చేమదుంప పంటపండే కాలవ్యవధి ప్రతి సంవత్సరం జనవరి నెలనుండి మొదలై ఇంచుమించు 7-8 నెలలు ఉంటుంది. అలాగే, చేమదుంప వేళ్లు, కాండం కూడా నేలపై తలెత్తి మొలిచేసరికి 60-80 రోజులవరకూ పడుతుంది. మొక్క ఆలస్యంగా పెరగడం వల్ల చేమదుంపను సాగుచేసే భూముల్లో నేల పైపొర చెప్పుకోతగ్గంత కాలం వరకూ నిరుపయోగంగానే ఉంటుందని గ్రహించి, రైతులు మెరుగైన ఉత్పత్తికోసం ఈ వనరులను మరింత లాభసాటిగా వినియోగించే మార్గాలను అన్వేషించారు. ముందుగా అంటే చేమదుంప మొలకెత్తి, నేలపైకి తల ఎత్తి నిలబడే లోపల రైతులు కొద్దికాలంలోనే మొలిచి, పెరిగే ఆకుకూరలను భూమి పైపొరలో పండించడం ప్రారంభించారు. చేమదుంప ఆలస్యంగా మొలకెత్తేది కాబట్టి పూర్తిగా కాపుకు రావడానికి పట్టే వ్యవధి 7-8 నెలలు ఉంటుంది. అందువలన, రైతులు ఈ చేమదుంప తోటలలో మరిన్ని ప్రయోగాలు చేశారు. చివరికి చేమదుంపను నాటే లోతును 10-20 సెం.మీ.ల నుం డి 20-30 సెం.మీ.కు మారుస్తూ, నేలలో నిలువుగా జాగా కలిసివచ్చేటట్టుగా చేస్తూ, ఒకేసారి బంగాళదుంపను కూడా చేమదుంప పెరిగే నేల పైపొర నుండి పండించే ఏర్పాటు చేశారు.

బహుళ పొరలలో విత్తనాలను నాటే పద్ధతి భూమి వైశాల్యాన్ని పెంచకుండా అదనపు కూరగాయల సాగుకు అదనపు స్థలాన్ని సమర్ధవంతంగా అందించింది.

> బహుళ పొరలలో విత్తనాలను నాటే పద్ధతి భూమి వైశాల్యాన్ని పెంచకుండా అదనపు కూరగాయల సాగుకు అదనపు స్థలాన్ని సమర్ధవంతంగా అందించింది.

రైతులు ఇప్పుడు బహుళ పొరలలో మూడు వివిధ రకాలైన కూరగాయ పంటలకోసం అంటే చేమదుంప, బంగాళదుంప మరియు ఆకుకూరల యొక్క విత్తనాలు/విత్తనదుంపలు లోతుగా, మధ్యస్తంగా మరియు పైపైన ఒకేసారి ఒకేపంటభూమిలో నాటే సాంకేతికపరిజ్ఞానంతో ముందుకొచ్చారు. బహుళ పొరలలో సేద్యం అని పిలువబడే ప్రజాదరణ పొందిన ఈ కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తూ, రైతులు ఒక యూనిట్ స్థలం నుండి అధికస్థాయిలో ఉత్పత్తిని సాధించేందుకు ప్రయత్నాలు చేశారు.

మెరుగుపరచబడిన ఈ సేద్యపు పద్ధతిననుసరిస్తూ రైతులు కొంత పెద్ద పరిమాణంలో ఉండే పంటపొలాలలో జనవరి నెలలో ముందస్తుగా ఈ చేమదుంప పంటను వేస్తారు. చేమదుంపకు పైభాగాన బంగాళదుంప నేలకు 10-15 సెం.మీ. లోతులో వేసి, చివరకి నేలపైపొరలో (అంటే 0-5 సెం.మీ. లోతు ఆకుకూరల విత్తనాలను వేస్తారు. నేల పైపొరలో వేసిన పంట (ఆకుకూరలు) వెంటనే మొలకెత్తి 20-25 రోజులలో, అంటే ఫిబ్రవరి చివరికి పంట చేతికొస్తుంది. ఆకుకూరల పంట పండిన వెంటనే, రెండవ పొరలో వేసిన బంగాళదుంప నేలపైకి మొలకెత్తి వస్తుంది. దీనిని రెండుసార్లు కలుపుతీసి మే నెలలో దుంప తవ్వడం జరుగుతుంది. బంగాళదుంప పంట అయిపోయేసరికి చేమదుంప నేల ఉపరితలంపై మొలకెత్తడంతో అక్టోబర్ నెలలో పంట పండడం జరుగుతుంది. నవంబర్ మరియు డిసెంబర్ నెలలలో, చలికాలంలో నాటడానికి ఉపయోగించేవిగా దేశవ్యాప్తంగా అధిక డిమాండ్ కలిగివున్న ఉల్లినారును పెంచడానికి చేమదుంప వేసిన పొలాలు ఉపయోగించబడతాయి. సాధారణంగా చిన్నవైన మరియు బహుళ పొరలలో విత్తనాలను నాటే పద్ధతి ద్వారా సేద్యం చేయని, మిగిలిన పొలాలలో వైవిధ్యంతో ఉండే, సీజనుకు తగ్గట్టుగా ఉండే కూరగాయలని, సంవత్సరం పొడుగునా పండించడం జరుగుతుంది. దగ్గరలో ఉండే మార్కెట్లలో ఈ కూరగాయలు రైతులు నేరుగా అమ్మడంగానీ లేక గ్రామంలో ఎవరైనా ఒకరు వాటిని కొని, దగ్గరలో ఉండే మార్కెట్‌కు అమ్మివేయడం గానీ జరుగుతుంది.

ఒకే స్థలంలో మూడు పంటలను పండించడం సహజంగానే పంటలలో నీటికి, పోషకపదార్థాలకు పోటీని సృష్టించడానికి దారితీస్తుంది. ఏమైనప్పటికీ, బహుళ పొరలలో విత్తనాలను నాటడం అనే పద్ధతి ప్రస్తుత సందర్భంలో మక్రాప్ గ్రామంలో అనుసరించబడడంతో రైతులు, ఈ పోటీలోని రెండు అంశాలూ కూడా సమర్ధవంతంగా నిర్వహిస్తున్నారు. ప్రకృతిసిద్ధంగా ప్రవహిస్తూ ఉండే నీటివనరులను తీసుకుని సిమెంట్ ట్యాంకులలో నిలువజేయడంతో సేద్యానికి, వేసవికాలంలో కూడా నీటికి కొరత ఉండదు. అదీకాకుండా రైతులు (సాధారణంగా ఏకాభిప్రాయం ఆధారంగా) సేద్యానికి నీటిపారుదలకోసం ఒక రొటేషనల్

(మార్పిడి) విధానాన్ని కూడా ఏర్పాటుచేసుకున్నారు. ఈ పద్ధతి ద్వారా ప్రతి రైతు కూడా ఒక క్రమమైన విరామంతో తన భూమికి నీటిపారుదల చేసుకోవడానికి అతనికివచ్చే అవకాశాన్ని వినియోగించుకుంటాడు. బహుళపొరల పంటభూములలో పోషకపదార్థాల విషయంలో ఉండే పోటీని అధిగమించడానికి డిసెంబర్ నెలలో విత్తనాలు/విత్తన దుంపలు నాటే ముందు ప్రతీ పంట పొలంలోనూ రైతులు దిబ్బెరువును అధిక పరిమాణంలో ఉపయోగిస్తారు. ఈ బహుళ పొరల పద్ధతి ద్వారా సేద్యం చేయబడే భూమి సాధారణంగా రైతులుండే నివాసాలకు దగ్గరగానే వుంటుంది కాబట్టి ఈ పంటపొలాలకు ఎరువును తోలడంలో అంతగా ఇబ్బంది ఉండదు. ముఖ్యంగా సరిపోయేంత నీరు మరియు దిబ్బెరువు అందుబాటు ఈ బహుళ పొరల సేద్యపు పద్ధతిని మక్రాప్ గ్రామంలో ఆచరణీయంగా చేసింది.


మూడు కూరగాయల పంటలు ప్రస్తుతం ఒకేసారిగా పండిస్తూ వుండడంతో ఈ కొత్త పద్ధతిలో చేమదుంపలు పండించే తోటలలో ప్రతి ఒక యూనిట్‌లోనూ కూరగాయల ఉత్పత్తి మరింతగా పెరిగింది. ఈ పద్ధతిలో ఉత్పత్తి పదార్థాల ఉపయోగం మరియు పంట దిగుబడి నిష్పత్తి (డబ్బు రూపంలో) 1:8గా ఉన్నట్లు లెక్కించబడింది. ఇది ఈ ప్రాంతపు గ్రామాలలో బంగాళదుంప (1:2) టమాట (1:5) క్యాప్సికమ్ (1:2) మరియు బఠాణీ (1:2) పంటలు ఏక పంటగా వేసినప్పటి ఉత్పత్తి పదార్థాలు-దిగుబడుల నిష్పత్తి కంటే చెప్పుకోతగ్గ స్థాయిలో అధికంగా ఉన్నట్లు నివేదించబడింది.

## ముగింపు

నేల మరియు నీటి వనరులను వివేకవంతంగా వినియోగించుకోవడంలో మక్రాప్ గ్రామంలో చేపట్టిన బహుళ పొరల కూరగాయల సేద్యం పరిమితంగా ఉన్న భూవనరులనుండి లభించే ప్రయోజనాలను పూర్తిగా అందుకోవడానికి ఒక అత్యుత్తమమైన ఉదాహరణ. అలాగే, మార్కెట్లు అందుబాటులో ఉండడం కూడా సేద్యపు పద్ధతులలోని ఇటువంటి నవకల్పనలో ముఖ్యమైన చోదకశక్తులలో ఒకటిగా ఉంటుంది. ఈ ప్రాంతంలో వుండే వ్యవసాయదారులలో ఈ గ్రామం ఆదర్శవంతమైన గ్రామాలలో ఒకటిగా పరిగణింపబడుతోంది. ఈ కూరగాయల సేద్యపు పద్ధతులలో భూమిలో ఇమిడి ఉన్న తేమ మరియు పోషకపదార్థాలవంటి క్రియాశీలక అంశాలను గురించి మరింతగా అధ్యయనం చేసే అవసరం ఎంతైనా ఉంది.

## కృతజ్ఞతలు

తగిన ప్రోత్సాహం అందించినందుకు, అవసరమైన సౌకర్యాలను కలుగజేసినందుకు జి.బి.పంత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ ఎన్విరాన్‌మెంట్ ఎండ్ డెవలప్‌మెంట్, అల్మోరా, ఇండియా, సంస్థ




డైరెక్టర్ గారికి, వారికున్న పరిజ్ఞానాన్ని మరియు కాలాన్ని మాతో పంచుకున్నందుకు మాక్రాప్ గ్రామ రైతులకు, రచయితలు తమ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నారు. ◆

**Prakash Singh**
(Research scholar) and GCS Negi (Scientist 'D')
G.B. Pant Institute of Himalayan
Environment and Development,
Kosi-Katarmal, Almora, Uttarakhand,
India. Email: dhailaprakash@yahoo.com

ఆంగ్లమూలం :

లీసా ఇండియా సంపుటి 15, సంచిక 4 డిసెంబర్ 2013



*రైతులు శ్రీవరి సాగు పద్ధతులను అవలంభించడం వలన పెరిగిన దిగుబడి*

# శ్రీవరి సాగు విస్తరణలో నేర్చుకున్న పాఠాలు

**టి.ఎం. రాధ**

**శ్రీవరి సాగు (సిస్టమ్ ఆఫ్ రైస్ ఇంటెన్సిఫికేషన్) ఎక్కువగా జ్ఞానానికి సంబంధించిన, నిరంతరం పరిణామం చెందే పద్ధతి. ఈ పద్ధతి విస్తృతంగా మరియు సుస్థిరంగా వ్యాప్తి చెందాలంటే, పూర్తిగా ఒక విభిన్నమైన పద్ధతి అవసరం. విజ్ఞాన సాధికారత, భాగస్వామ్య ప్రక్రియలు, నిరంతర చేయూత, సంస్థాగత కలయిక మరియు ప్రభుత్వ మద్దతు శ్రీవరిసాగు వ్యాప్తికి సాధనాలు.**

దక్షిణ భారతంలోని ఆంధ్రప్రదేశ్, కర్ణాటక మరియు తమిళనాడు రాష్ట్రాలకు చెందిన కరువుపీడిత జిల్లాల్లో సాంప్రదాయకంగా, కుటుంబ ఆహార అవసరాలను తీర్చడం కోసం, స్థానికంగా పండే, పోషకవిలువలు ఎక్కువగా వున్న చిరుధాన్య పంటలు పండిస్తున్నారు. అయితే, కొంతకాలంగా చాలామంది రైతులలో మార్పు వచ్చి, ఏమాత్రం నీటి పారుదల సదుపాయం ఉన్నా చిన్న చిన్న మళ్లలో, బాహ్య అవసరాలను అధికంగా ఉపయోగించి వరి పండించడం ప్రారంభించారు. కరువులు, సర్వ సాధారణమైన ఈ ప్రాంతంలో అనిశ్చిత వర్షపాతం కూడా తోడై గణనీయమైన నీటిఎద్దడి కలగజేసింది. అంతేకాక, విచక్షణా రహితంగా భూగర్భజలాలను తోడెయ్యడం, మరియు నీటి సంరక్షణ పద్ధతులు పాటించక పోవడం వలన భూమిలోని తేమ శాతం తగ్గిపోయింది. దీనివల్ల ఉత్పాదకత తగ్గి, సహజ వనరుల పతనం ప్రారంభమయ్యింది. జలవనరులు కరువైన చోట నీటిని వివేకంతో తెలివిగా ఉపయోగించడంలో మెట్ట ప్రాంతపు రైతులకు సహాయపడే ఉద్దేశ్యంతో ఎ.ఎం.ఇ.ఎఫ్. సంస్థ వారు శ్రీవరి సాగుని మొదట్లో వరి పంట, క్రమంగా రాగి మరియు కందిపప్పు పంటలలో ప్రోత్సహించారు.

## కొత్త పద్ధతి ప్రయత్నం

2004-05లో, ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా తక్కువ దిగుబడి పొందుతున్న కొందరు రైతులు వారి పంటదిగుబడి మెరుగుపరుచుకునే మార్గం కోసం అన్వేషించసాగారు. అప్పట్లో శ్రీవరి సాగు కొత్త విధానము. కానీ, రైతులు ఎ.ఎం.ఇ.ఎఫ్. సంస్థ సహాయంతో తమ భూముల్లో కొంత భాగంలో ఈ పద్ధతిని ప్రయత్నించగా పంట దిగుబడి అత్యంత ప్రోత్సాహకరంగా వచ్చింది. ఇది ఆ ప్రాంతంలో మరికొందరికి ఆ తరువాత సీజన్లో శ్రీవరి సాగు పద్ధతిని అవలంభించేందుకు ప్రేరణగా నిలిచింది. ఈ ఫలితాలతో ప్రేరణ పొంది, మేము పనిచేస్తున్న ఇతర ప్రాంతాల్లో రైతులను అవగాహనా సదస్సుల నిర్వహణ ద్వారా ఆంధ్ర రాష్ట్ర సందర్శనకు ప్రేరేపించాము. 2008 చివరికి, ఒక్క ఆంధ్ర రాష్ట్రం నుండే కాక, కర్ణాటక మరియు తమిళనాడు రాష్ట్రాల్లో కూడా 250 కన్నా ఎక్కువమంది రైతులు వరి పండించడంలో సాగు పద్ధతులను అనుసరించడం ప్రారంభించారు.

2008-09లో మా పని విస్తరించేందుకు డబ్ల్యు.డబ్ల్యు.ఎఫ్. (వరల్డ్ వైడ్ ఫండ్ ఫర్ నేచర్) మరియు దేశ్‌పాండే ఫౌండేషన్ సంస్థలు అందించిన తోడ్పాటు దోహదపడింది. ఆంధ్రరాష్ట్రంలో చిత్తూరు మరియు మహబూబ్‌నగర్, తమిళనాడులో ధర్మపురి, కృష్ణగిరి, పెరంబలూర్, పుదుక్కోట్టై మరియు తిరుచి, కర్ణాటకలో ధార్వాడ్ మరియు హస్సన్ - ఈ తొమ్మిది జిల్లాల్లోని రైతులతో కలిసి పనిచేయడం ప్రారంభించాము. ధార్వాడ్‌లోని వర్షాధార ప్రాంతాలలో సైతం శ్రీవరి సాగు ప్రోత్సహించడం అన్నది ఎ.ఎం.ఇ.ఎఫ్. సంస్థ ఎదుర్కొన్న ఒక పెనుసవాలు. 2009-10 నాటికి, 4900 కన్నా ఎక్కువ మంది రైతులు శ్రీవరి సాగు చేపట్టారు. నాబార్డ్ నుండి అందిన అదనపు మద్దతుతో 2010-11 నాటికి 13000 మంది రైతులను, 2011-12 నాటికి 16000 మంది రైతులను మరియు 2012-13 నాటికి 19000 మంది రైతులనూ చేరుకోగలిగాము.

## నేర్చుకొనుట, క్రొత్త ఆవిష్కరణలు, సాధికారత

శ్రీవరి సాగు జ్ఞానంతో కూడుకున్న పద్ధతి కావడం మూలాన, మా శ్రీవరి సాగు ప్రయాణంలో రైతులకు అందులోని సూత్రాలు కూడా అర్ధమయ్యేట్టుగా చేయడం మొదలుపెట్టాము. ఇందుకోసం, మేము ఒక పంట పూర్తికాలం నేర్చుకోవడానికి అవకాశం కల్పించే

> భాగస్వామ్య ప్రక్రియలు రైతులలో నూతన ఆవిష్కరణల స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడ్డాయి. రైతు క్షేత్ర పాఠశాలలో (ఫార్మర్ ఫీల్డ్ స్కూల్స్) రైతులు అనేక సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చారు.



*రాగి పంటలో, రైతు క్షేత్ర పాఠశాలలో భాగంగా అగ్రో ఇకో సిస్టమ్ ఎనాలిసిస్ (వ్యవసాయ జీవావరణ వ్యవస్థ విశ్లేషణ) జరుపుతున్న రైతులు*

ఫార్మర్ ఫీల్డ్ స్కూల్ (ఎఫ్.ఎఫ్.ఎస్. - రైతు క్షేత్ర పాఠశాల) పద్ధతిని ఎన్నుకొన్నాము. రైతుసంఘాలను ఏర్పాటు చేయడం జరిగింది. ఫార్మర్ ఫీల్డ్ స్కూల్స్ (ఎఫ్.ఎఫ్.ఎస్.) ద్వారా పంటకాలమంతా రైతులకు మార్గనిర్దేశం అందింది. ఎఫ్.ఎఫ్.ఎస్. ద్వారా రైతులు ఆచరణాత్మకంగా గమనించి వారి పొలాలలో చేయడం నేర్చుకున్నారు. పాత సంప్రదాయ పద్ధతులలో నీటిమళ్ళల్లో వరి పండించే రైతులను వారి అభిప్రాయాల నుండి బయటకు తీసుకురావలసిన అవసరం చాలా ప్రధానమైన విషయం. నిరంతర చేయూత, రైతులు ఒక దృఢనిశ్చయంతో శ్రీవరిసాగు పట్ల మొగ్గు చూపడానికి సహాయపడింది. ఎఫ్.ఎఫ్.ఎస్. మరియు పి.టి.డి. (పార్టిసిపేటరీ టెక్నాలజీ డెవలప్మెంట్)తో పాటు, శిక్షణా కార్యక్రమాలు, క్షేత్ర ప్రదర్శనలు, అధ్యయన పర్యటనలు మరియు రైతు దినోత్సవాలు వంటివి ఏర్పాటు చేయడం ద్వారా వారు శ్రీవరిసాగు గురించి తెలుసుకోవడం సాధ్యపడింది. శ్రీవరిసాగు పద్ధతుల విస్తరణలో రైతులు నేరుగా ఒకరి నుండి ఒకరు నేర్చుకునే ప్రక్రియ అత్యంత సమర్థవంతమైనదిగా నిలిచింది. ప్రతీ ఏడాది, ప్రతి ఒక్క గ్రామంలో సగటున, 250కి పైగా శిక్షణా కార్యక్రమాలు, రెండు పరిజ్ఞానం / అనుభవాలు పంచుకునే కార్యక్రమాలూ, ప్రతి పంటకాలం చివర క్షేత్ర దినోత్సవాలు (ఫీల్డ్ డేస్) నిర్వహించారు.

రైతులకు వారి పరిస్థితులకనుగుణంగా అనుకూలమైన ఉత్తమ పద్ధతులను గుర్తించేందుకు వారి పొలాలలో ప్రత్యామ్నాయాలను ప్రయత్నించడంలో వారిని ప్రోత్సహించాము. ఒక సమస్యను పరిష్కరించడానికి, అందుబాటులో ఉన్న వివిధ పద్ధతులను ప్రయత్నించి, వాటి యొక్క ఉపయోగాన్ని అంచనా వేయడానికి ఆసక్తి కనబరచిన రైతులతో పి.టి.డి. (పార్టిసిపేటరీ టెక్నాలజీ డెవలప్‌మెంట్) ప్రయోగాలు చేపట్టేలా చెయ్యడం జరిగింది.

ముఖ్యంగా ఈ జోక్యాలు కొత్తగా మొదలుపెట్టిన ప్రాంతాలలో విత్తన మోతాదు, వరి నారు యొక్క వయస్సు, కలుపు యాజమాన్యం మరియు నీటి వినియోగ సామర్థ్యాన్ని లెక్కకట్టడం వంటి అంశాలలో పరీక్షలు నిర్వహించడం జరిగింది. మొత్తానికి ఇటువంటివి, 18 పరీక్షలు ప్రవేశపెట్టడం జరిగింది.

ఈ భాగస్వామ్య ప్రక్రియలు రైతులలో నూతన ఆవిష్కరణ స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడ్డాయి. రైతులు అనేక సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చారు. ఉదాహరణకు, వ్యవసాయ శాఖ అందించిన లోహంతో చేసిన సీడ్ డ్రిల్స్ బరువుగానూ మరియు త్వరగా పాడయ్యే తత్వం కలిగివుండడం వల్ల, రైతులు, స్థానిక చేతి వృత్తి పనివారి సహాయంతో తక్కువ బరువుతో కూడిన చెక్క డ్రిల్‌ని రూపొందించారు. మరొక సందర్భంలో, సైకిల్ వీడర్‌లోని లోహపు బ్లేడ్స్ సవరించి కలుపుతీసే పారని అదనంగా కలపడం మూలాన, తడినేలల్లో దున్నడానికి వీలు కలిగింది.

భాగస్వామ్య ప్రక్రియలు నూతన ఆవిష్కరణ స్ఫూర్తిని పెంపొందించేందుకు దోహదపడ్డాయి. ఎఫ్.ఎఫ్.ఎస్. (ఫార్మర్ ఫీల్డ్ స్కూల్స్) జరిగే సమయంలో రైతులు అనేక సరికొత్త ఆవిష్కరణలతో ముందుకొచ్చారు.

అయినప్పటికీ, శ్రీవరిసాగు పద్ధతులను స్వీకరించడంలో రైతులకు ప్రాంతాలవారీగా వివిధ రకాల అడ్డంకులు అనేకం ఏర్పడ్డాయి. ఎ.ఎం.ఇ.ఎఫ్.సంస్థ సీజను పొడవునా రైతుల అవసరాలకు సానుకూలంగా స్పందించి వారికి తగిన తోడ్పాటుని అందించింది. ఉదాహరణకు, సోమనకొప్ప గ్రామంలో వరినారు తీసి తిరిగి నాటడం కోసం సరైన సమయంలో కూలీలు దొరకడం చాలా కష్టం. కూలీలమీద ఆధారపడ్డ రైతులను చైతన్య పరచడానికి రైతుసమూహాలకు వరినాటే యంత్రాన్ని (ట్రాన్స్ ప్లాంటర్) అందించారు. ఎనిమిది వరుసల ఈ వరినాటు యంత్రాన్ని వాడడం వల్లసరైనసమయానికినాట్లుపూర్తవడమేకాక,అంతకుముందయ్యే కూలీ ఖర్చులలో ఆరవ వంతు తగ్గించగలిగారు.

## గ్రామాల్లో వ్యాప్తికి కృషి

సాంప్రదాయంగా వరి పండించే విధానానికి పూర్తిగా విరుద్ధంగా ఉన్న కారణంగా, శ్రీవరిసాగుని విస్తరించి, ఆ విధానం కొనసాగేలా చెయ్యడానికి నిరంతరం నమ్మకాన్ని పెంచుతూ, సలహాలు, సూచనలను అందిస్తూ, చేయూతనివ్వడం అవసరం. నిరంతర మద్దతు అందించడం ఒక వెలుపలి సంస్థకు సాధ్యంకాదు కాబట్టి, స్థానికంగా వున్న రైతు యువకులను ఎంపికచేసి వారికి క్రమపద్ధతిలో వారు స్థానికంగా అందుబాటులో వుండే సస్టైనబుల్ అగ్రికల్చర్ ప్రోమోటర్స్ (ఎస్.ఏ.పి.)గా తీవ్రమైన శిక్షణనిచ్చారు. ఈ యువత ప్రత్యామ్నాయ పద్ధతులను సాధన చేయడంతోపాటు, వారు నేర్చుకున్న విషయాలను ఇతరులతో పంచుకుంటూ వారికి సలహాలు, సూచనలు అందిస్తూ ఉంటారు. ఎస్.ఏ.పి. లుగా శిక్షణ పొందిన 500లకి పైగా రైతు యువకులు శ్రీవరిసాగు వ్యాప్తికి విశేషమైన తోడ్పాటు అందిస్తున్నారు. ఎస్.ఏ.పి. ల ద్వారా నిరంతర మార్గదర్శకత్వం లభించడం వలన అనేకమంది రైతులు శ్రీవరి సాగును చేపట్టారు. ఉదాహరణకి, కోలార్ జిల్లాలోని డిపి హళ్లి అనే గ్రామాన్ని ''శ్రీ గ్రామం'' అని పిలుస్తారు, అక్కడి వరి పండించే రైతులంతా శ్రీవరి సాగు పద్ధతికి మారడం వల్ల.

## వ్యవస్థీకృత కేంద్రీకరణ

విస్తృత వ్యాప్తి కొరకు, ఏ.ఎం.ఇ.ఎఫ్. సంస్థ ఇటువంటి అంశాలపై పనిచేస్తున్న ఇతర ప్రభుత్వేతర సంస్థలకు శిక్షణను, క్షేత్రస్థాయిలో మార్గదర్శకత్వాన్ని అందిస్తూ వివిధ ఎస్.జి.ఓ.లు, ఎస్.జి.ఓ.ల నెట్వర్కులతోను కలిసి పనిచేయడం మొదలుపెట్టింది.

ఈ సంస్థ తమిళనాడులోని పిఎస్ఎస్ఎస్, బిఈఎస్‌టి, ఎస్‌పిపిడి సంస్థలతోనూ, ఆంధ్రరాష్ట్రంలోని ఏకొ క్లబ్ మరియు ఏవిఐఫ్ సంస్థలతోనూ కలిసి పనిచేసింది. అట్టడుగు స్థాయిలో పనిచెయ్యనటువంటి ప్రాంతాలలో ఏ.ఎం.ఇ.ఎఫ్. ప్రధానస్రవంతి లోవున్న సంస్థలను ప్రభావితం చెయ్యడం మొదలు పెట్టింది. మొదలు పెట్టిన చొరవలను బలోపేతం చెయ్యడం కోసం, స్థానిక అభివృద్ధి సంస్థలైన విద్యా సంస్థలూ, ప్రభుత్వ విభాగాలతో క్రియాశీలక సంబంధాలు ఏర్పరచుకోవడం జరిగింది.

ఉదాహరణకు, 2009 వేసవిలో డిపార్టమెంట్ ఆఫ్ అగ్రికల్చర్ (డిఓఏ) తో కలిసి, ఏఎంఇఎఫ్ కర్నాటక రాష్ట్రంలోని హాసన్ జిల్లాలో సక్లేష్పూర్ తాలూకాలో కేంద్రీకృత కార్యక్రమాన్ని ప్రారంభించింది. తమిళనాడులో ఏఎంఇఎఫ్, ఐదు జిల్లాల్లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటుచేసిన ''ఫార్మ్'' (క్షేత్ర) పాఠశాలలకు వనరుల సంస్థగా వుంది. ఈ క్షేత్ర పాఠశాలలో శ్రీవరి సాగు ప్రధానాంశం.

## ప్రత్యేక ప్రచారాలు

శ్రీ అభియానా వంటి ప్రత్యేక ప్రచారాలు చేపట్టారు. 2009లో, ఏఎంఇఎఫ్, శ్రీ అభియానా కార్యక్రమాన్ని ప్రారంభించి రైతులకు అవగాహన కల్పించడమేకాక, శ్రీవరికి జిల్లాలోని వివిధ సంస్థల, ప్రజా ప్రతినిధుల మరియు మీడియా యొక్క మద్దతు కూడా పెంచుకుంది. ఇది 25 గ్రామాలలోని దాదాపు 1500 మంది రైతులను చేరుకోడానికి సహాయపడింది. ఈ విధానం కర్నాటక జిల్లాలైన కోలార్ మరియు చిక్‌బళ్ళాపూర్‌లకు పొడిగించబడింది. ధార్వాడ్ జిల్లాలోని 30 గ్రామాల్లో వీడియో కార్యక్రమాలు, గోడల మీద వేసిన చిత్రాలూ, చిత్రపటాలు, బానర్ల వంటి ప్రచార సాధనాలను ఉపయోగించి శ్రీవరిసాగు సిద్ధాంతం గురించి పెద్ద సంఖ్యలో రైతులకు అవగాహన కలిగించారు.

## శ్రీవరిసాగు ఇతర పంటలకు విస్తరింపజేయడం

ఒకసారి శ్రీవరి వల్ల వరిపంటల్లో అధిక దిగుబడి సాధించవచ్చని రైతులు తెలుసుకున్నాక, ఈ సిద్ధాంతాన్ని వారు పండిస్తున్న ఇతర పంటలైన రాగి కంది పంటలలో ప్రయత్నించాలన్న ఆసక్తి కలిగింది.

2010-11లో సుమారు 290 మంది రాగి పండించే రైతులు, తక్కువ విత్తన మోతాదు, చిన్న మొలకలను నాటడం, కలుపు నిర్వహణ వంటి శ్రీవరి సాగు సిద్ధాంతాలను ప్రయత్నించారు. కోలార్ జిల్లాలోని 14 గ్రామాలలోని ఈ రైతులు శ్రీవరిసాగు పద్ధతులను అవలంభించి 209 ఎకరాల్లో రాగి పండించారు. శ్రీవరిసాగు పద్ధతులను అనుసరించడం వలన ఈ రైతులు 22% అధిక దిగుబడి, 33% అధిక నికరాదాయం సాధించారు. తరువాతి సంవత్సరాలలో ఎక్కువమంది ఈ పద్ధతులను సాధన చేశారు మరియు ప్రస్తుతం 900 కన్నా ఎక్కువ మంది రైతులు రాగిపంటకు శ్రీ పద్ధతులను అనుసరిస్తున్నారు. అలాగే, 2010-11 సంవత్సరాల్లో, కోలార్ జిల్లాలోని 5 గ్రామాల్లో 35 మంది కంది పండించే రైతులు 16 ఎకరాల్లో శ్రీ పద్ధతిని స్వీకరించి 70% కన్నా మించి అధిక దిగుబడిని పొందారు.

## నేర్చుకున్న పాఠాలు

ఈరోజు, శ్రీ, మూడు జిల్లాల్లోని కరువు పీడిత ప్రాంతాల్లో, 19000 కన్నా ఎక్కువమంది వరి పండించే రైతులను, 977 మంది రాగి, కంది పంటలలో రైతులను మరియు 70 మంది కంది రైతులను చేరుకొంది. గత 8 సంవత్సరాల అనుభవాలను నెమరువేసుకుంటే, మా విజయానికి దోహదపడిన కారణాలు అనేకం అని కనుగొన్నాము. పంట కాలం మొత్తం కొనసాగే భాగస్వామ్య పద్ధతులను (ఎఫ్.ఎఫ్.ఎస్.) స్వీకరించడం వలన ఎంతో ప్రయోజనం చేకూరిందని మేము గట్టిగా నమ్ముతున్నాము. శ్రీ విధానము, జ్ఞానసముపార్జనతో కూడుకున్న పద్ధతే కానీ ఉత్పాదకాలపై, అధిక పెట్టుబడిపై ఆధారపడేది కాదు. ఎఫ్.ఎఫ్.ఎస్. మరియు పి.టి.డి. ప్రక్రియలు, రైతులకు, అర్థం చేసుకోడానికి, నూతన ఆవిష్కరణలకు మరియు ప్రత్యామ్నాయాలను ప్రయత్నించడానికి కావలసిన సమయమూ మరియు అవకాశం కల్పించాయి. పంటలనుండి ఉద్భవించిన సత్ఫలితాలు రైతులను ఒప్పించేందుకు తగిన నమ్మకాన్ని కలిగించాయి. అలాగే, రైతుల సమూహంతో పని చెయ్యడం వలన ఎన్నో ప్రయోజనాలు వున్నాయి. ముఖ్యంగా ఇది జ్ఞాన మార్పిడికి సహాయపడింది.

మేము కలిసి పనిచేసే రైతులు తెగింపుకు సంకోచించే చిన్న రైతులు కావడం వలన శ్రీ పద్ధతులను అనుసరించడానికి, కనీసం మూడు పంట కాలాలపాటు వారికి నిరంతర చేయూత అవసరమని అర్థం చేసుకొన్నాము. ఎఫ్.ఎఫ్.ఎస్. ఇటువంటి మద్దతుని ఒక పంట కాలం పాటు కల్పించగా, మా సస్టైనబుల్ అగ్రికల్చర్ ప్రమోటర్స్ (ఎస్.ఏ.పి.లు) క్రమం తప్పకుండా సందర్శించి, వారి వెంట వుండి ఆ మద్దతును కొనసాగించారు. అందుకే, మా ప్రయత్నాలన్నీ మానవ వనరుల సామర్థ్యాన్ని పెంచే దిశగానే సాగాయి - అది రైతులు కానీ యువత కానీ.

శ్రీవరిసాగు వ్యాప్తికోసం, మా సొంత పని ప్రదేశాలను మించి వెళ్లాలంటే, ఇతర సంస్థలతో కలిసి పనిచేయక తప్పదు అని మా అనుభవం నేర్పింది. దీనిని బట్టి, భావజాలపరంగా కాని, పద్ధతులపరంగాకానీ, కేంద్రీకరణ కలిగి ఉండాలన్నది మాకు స్పష్టమైంది. ఇది సంస్థాగత సంబంధాలు మరియు నిధుల మద్దతు నిర్మాణం మీద భారీగా ఆధారపడి వుంది.

ఆహార ఉత్పత్తి, వనరుల సంరక్షణ మరియు వాతావరణ మార్పుపై ప్రభావం చూపడానికి శ్రీ సాగును పెద్ద ఎత్తున స్వీకరించాల్సిన అవసరం వుంది. రాష్ట్ర ప్రభుత్వ మద్దతు మరియు ప్రమేయం లేనప్పుడు, శ్రీవరిసాగు చెదురు ముదురు గానే కొనసాగుతుంది.

చిన్న, సన్న కారు రైతులను శ్రీవరిసాగు పరిధిలోకి తీసుకురావడానికి విజ్ఞానం, పరిశోధన మరియు విస్తరణకు పెట్టుబడి రూపంలో తోడ్పాటునందించడం ఎంతో అవసరం. చిన్న రైతులకు శ్రీవరిసాగు స్వీకరణలో ప్రేరణకు నిరంతరం చేయూత అవసరమైతే, వరి ఉత్పత్తిలో అధిక భాగం ప్రధాన నియంత్రణ కలిగిన పెద్ద రైతులు కూడా శ్రీవరిసాగు స్వీకరించవలసిన అవసరం వుంది. ప్రస్తుతం, అనేకమంది పెద్ద రైతులకు అనేక కారణాలవలన శ్రీవరిసాగు అవలంభించడం కష్టంగా ఉంది. అటువంటి రైతులకు, ప్రభుత్వ పెట్టుబడి అవసరం, ఉదాహరణకు, కూలీలపై ఆధారపడడాన్ని తగ్గించడానికి స్థానిక పరిస్థితులకు అనువైన యంత్రాలను రూపొందించడం.

మరీ ముఖ్యంగా, విస్తృతస్థాయిలో శ్రీవరి సాగు స్వీకరణ శ్రీవరి సాగు రైతులకు ఏ విధంగా అందించబడింది అన్నదానిమీద ఆధారపడి ఉంటుంది. శ్రీవరిసాగుని, ఉత్పాదకాలను అందించడం ద్వారా రైతులపై బలవంతంగా రుద్దబడే ఇతర సాంకేతిక పద్ధతులలా చూడకూడదు. శ్రీవరిసాగు, ప్రతి ప్రదేశంలో అవసరానికి తగ్గట్టు వికసించే ఒక అనుకూలమైన పద్ధతి. ఇందుకొరకు, ప్రభుత్వం, భాగస్వామ్య ప్రక్రియల ద్వారా రైతులను చేరుకోగల క్షేత్రస్థాయి సంస్థలతో కలిసి పనిచేయవలసి ఉంటుంది. అప్పుడే, శ్రీవరిసాగు వేగంగా మరియు స్థిరంగా వ్యాప్తి చెందుతుంది. ◆

**T M Radha**
AME Foundation, #204, 100 Ft. Ring Road,
Banashankari, 2nd Block, Stage, Bangalore – 560085
Email: amebang@giasbg01.vsnl.net.in

ఆంగ్లమూలం :

లీసా ఇండియా సంపుటి 15, సంచిక 1 మార్చి 2013



# సేంద్రీయంగా ఎదగడం

## సంస్కృతిని పంచుకోవడం ద్వారా జ్ఞానాన్ని పెంచుకోవడం

### హరీష్ తివారీ మరియు పూనం తివారీ

**రసాయనిక వ్యవసాయ విధానం మీద అతిగా ఆధారపడ్డ కొత్త తరానికి సేంద్రీయ వ్యవసాయాన్ని నేర్పించడంకోసం ప్రపంచం నలుమూలల్లోని యువ వ్యవసాయ నిపుణులను భారతదేశంలోని సేంద్రీయ క్షేత్రాలతో అనుసంధానం చేసే ప్రయత్నం చేపట్టింది డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా సంస్థ. ఈ సంస్థ తన వివిధ కార్యక్రమాల ద్వారా, రైతులు సేంద్రీయ పద్ధతులను అవలంభించేటట్టు చేయడంతోబాటు, విద్యార్థులకు వ్యవసాయం మీద, సేంద్రీయ ఉత్పత్తి మీద అవగాహన కల్పిస్తూ వివిధ దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడికి దోహదపడింది.**

పర్యావరణ పరిరక్షణ గురించీ, వ్యవసాయ రసాయనాల వలన కలిగే అనారోగ్యాల గురించీ ప్రజలలో పెరుగుతున్న అప్రమత్తత కారణంగా, ఆహార నాణ్యత పట్ల వినియోగదారుల వైఖరిలో పెను మార్పు చోటుచేసుకుంది. అపాయం కలిగించని, సురక్షితంగా భావించే సేంద్రీయ ఆహారాన్నే ప్రపంచంలోని వినియోగదారులంతా కోరుకుంటున్నారు. అభివృద్ధి చెందిన దేశాలలోనూ, అభివృద్ధి చెందని దేశాలలోనూ కూడా సేంద్రీయ ఆహారానికి ఉన్న డిమాండు 20-25% వృద్ధి రేటుతో స్థిరంగా పెరుగుతోంది.

భారతదేశంలో సేంద్రీయ వ్యవసాయానికి ఎంతో మంచి అవకాశం ఉంది. భారతీయ వ్యవసాయ పద్ధతులలో సేంద్రీయ వ్యవసాయం ఒక భాగంగానే ఉంటూ వచ్చింది. పంటలు, పశువులు కలిసిన సమగ్ర వ్యవసాయ ధోరణి వాడుకలో ఉండడం, వైవిధ్యభరితమైన వ్యవసాయ వాతావరణ పరిస్థితులు ఉండడం వలన అధిక జీవ వైవిధ్యం కలిగిఉండడం మరియు చిన్న, సన్నకారు రైతులు అధిక సంఖ్యలో ఉండడం వలన భారతదేశంలో సేంద్రీయ వ్యవసాయానికి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.

అంతేకాక, దేశంలోని చాలా ప్రాంతాలలో, ముఖ్యంగా కొండ ప్రాంతాలలో మరియు వర్షాధార ప్రాంతాలలో, తక్కువ పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేసే అలవాటు అనాదిగా వస్తుండడం కూడా ఒక అదనపు ప్రయోజనంగా మారి రైతులు సేంద్రీయ వ్యవసాయానికి



అతిథేయ క్షేత్రాలలో పనిచేస్తూ సేంద్రీయ వ్యవసాయం నేర్చుకుంటున్న వాలంటీర్లు



నేల తయారీలో అతిథేయ రైతుకు సహాయపడుతున్న వాలంటీర్

మారడానికి బాగా దోహదపడుతుంది. తద్వారా ఈ రైతులు సేంద్రీయ ఉత్పత్తులకు గిరాకీ నిలకడగా పెరుగుతున్న జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లను అందుకోగలుగుతారు. రసాయనిక వ్యవసాయం మీద అధికంగా ఆధారపడ్డ నవతరానికి సేంద్రీయ వ్యవసాయ పద్ధతులలో శిక్షణ అందించడం తక్షణ అవసరం.

## డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా పుట్టుక

భారతదేశంలో గత చాలా కాలంగా రసాయనిక వ్యవసాయ పద్ధతులే ప్రాచుర్యంలో ఉండడం వలన రసాయనాలు ఉపయోగించకుండా చేసే వ్యవసాయం గురించి తెలిపే సమాచారం చాలా తక్కువ ఉంది. ఈ విషయంలో సలహాలు, సూచనలు అందచేయగల నిపుణులు కూడా తక్కువే. మామూలు వ్యవసాయ విస్తరణ వ్యవస్థ ప్రధానంగా మామూలు రసాయనిక వ్యవసాయ పద్ధతులను, పరిజ్ఞానాన్ని మాత్రమే విస్తరిస్తుంది. చాలా సందర్భాలలో, ప్రభుత్వ విధానాలన్నీ కూడా ఇప్పటికీ వ్యవసాయంలో రసాయనాల వినియోగాన్నే ఎంతో సమర్థవంతంగా సమర్థిస్తున్నాయి కానీ సేంద్రీయ వ్యవసాయ విధానాన్ని అంతగా ప్రోత్సహించడంలేదు.

2007లో నెలకొల్పబడిన వర్ల్డ్ వైడ్ ఆపర్చ్యునిటీ ఆన్ ఆర్గానిక్ ఫార్మ్స్ ఇండియా (డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్.ఇండియా) సంస్థ ఈ లోటును తీర్చడానికి సేంద్రీయ వ్యవసాయం మొదలుపెట్టాలన్న ఆసక్తి ఉన్న రైతులకు అవసరమైన సాంకేతిక తోడ్పాటు అందిస్తుంది. ఈ క్రమంలో మెల్లమెల్లగా డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా నెట్వర్క్‌లో మరింతమంది రైతులను చేర్చుకుంటూ ఉంది. 2007లో కేవలం 14 సేంద్రీయ క్షేత్రాలు ఉన్న ఈ నెట్వర్క్‌లో ఇప్పుడు, ప్రభుత్వేతర సంస్థలతో కలిపి, 180కి పైగా సేంద్రీయ హోస్ట్ ఫార్మ్స్ (అతిథేయ క్షేత్రాలు) ఉన్నాయి. ఈ డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా నెట్వర్క్ ఇప్పుడు భారతదేశంలోని 16 రాష్ట్రాలకు విస్తరించి ఉంది.

రైతులు సేంద్రీయ వ్యవసాయం చేపట్టేందుకు అవసరమైన సహాయాన్ని అందించడం, విద్యార్థులకు వ్యవసాయం మరియు సేంద్రీయ ఉత్పత్తికి సంబంధించి ఆచరణాత్మక అనుభవం కల్పించడం మరియు వివిధ దేశాల మధ్య సాంస్కృతిక మార్పిడికి వెసులుబాటు కల్పించడం ఈ డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా సంస్థ యొక్క లక్ష్యం. సేంద్రీయ మరియు జీవగతిశీల (బయోడైనమిక్) జీవన విధానాలపై ఆసక్తిని, అవగాహనను కల్పించడం డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా సంస్థ యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఇందుకొరకు ఈ ప్రయోజనానికి అనువైన స్థలాల జాబితాను తయారుచేసి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వాలంటీర్లకు (స్వచ్ఛంద సేవకులు) అందుబాటులో ఉంచుతుంది. ఈ విధంగా, ప్రజలు ఇతర దేశాలకు వెళ్ళి, అక్కడి ప్రజల గురించీ, వారి జీవన శైలి మరియు సంస్కృతి గురించీ తెలుసుకోవడాన్ని ప్రోత్సహించడం జరుగుతుంది. ఈ కార్యక్రమం, మార్పిడి పద్ధతిపై ఆధారపడి నడుస్తోంది. అతిథేయ సేంద్రీయ క్షేత్రాలు వసతి, భోజనం అందించడం, అతిథులు సహాయం అందించడం జరుగుతుంది. ఈ విధంగా సభ్యులు ఈ కార్యక్రమాన్ని సాధ్యమైనంత తక్కువ ఖర్చుతో నిర్వహించుకోవడం కుదురుతుంది.

సేంద్రీయ వ్యవసాయ ఆచరణ పద్ధతులు మరియు వాలంటీర్ నెట్వర్కులు ఎటువంటి ఆటంకాలూ లేకుండా వర్ధిల్లడానికి డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. భారతదేశంలో 4 డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. గ్లోబల్ విలేజస్ (డబ్ల్యు.జి.వి.)ను సేంద్రీయ వ్యవసాయ

పరిశోధనకు కేంద్రాలుగా తీర్చిదిద్దే సంకల్పంతో ఉంది. వీటిలో మొదటి డబ్ల్యు.జి.వి. మధ్యప్రదేశ్‌లోని సూరజ్‌పూర్ గ్రామంలో 4.5 ఎకరాల భూమిలో నెలకొల్పింది. ఈ క్షేత్రం ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ఖజురహో దేవాలయానికి సమీపాన, కెన్ నది మరియు పన్నా టైగర్ రిజర్వుకి ఆనుకుని ఉంది.

## ఫార్మ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం (క్షేత్ర విద్యా కార్యక్రమం)

సేంద్రీయ వ్యవసాయం నేర్చుకోవడానికి ప్రధానంగా రెండు మార్గాలు ఉన్నాయి - అతిధేయ క్షేత్రాలలో కానీ, డబ్ల్యుడబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్.గ్లోబల్ విలేజస్‌లో కానీ, వాలంటీరింగ్ (స్వచ్ఛంద సేవకులుగా చేరడం) మరియు ఇంటర్న్‌షిప్స్ (శిక్షణలో మలిదశ) కార్యక్రమాలలో చేరడం.

## వాలంటీరింగ్ (స్వచ్ఛంద సేవకులుగా చేరడం)

వాలంటీరింగ్ కార్యక్రమం అతిధేయ క్షేత్రాలలో కానీ, డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. గ్లోబల్ విలేజస్‌లో కానీ జరుగుతుంది. వాలంటీర్లు ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ దేశాలనుండి వస్తారు. సాధారణంగా సుస్థిర వ్యవసాయ పద్ధతులు మరియు హరిత జీవనశైలి పట్ల ఇష్టం ఉన్న యువత వాలంటీర్లుగా చేరతారు. వ్యవసాయపు పనులలో సహాయకులుగా ఉంటూ వీరు స్థానిక సుస్థిర వ్యవసాయ పద్ధతులనూ, విషయాలనూ తెలుసు కుంటారు.

ఈ వాలంటీర్లకు అతిధేయ సేంద్రీయ క్షేత్రాలలో (హోస్ట్ ఆర్గానిక్ ఫార్మ్స్)లో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. వాలంటీర్లు అక్కడే ఉంటూ, అక్కడే నేర్చుకుంటారు. ఈ హోస్ట్ ఫార్మ్స్‌లో ఆహారాన్ని సేంద్రీయంగా పండించడం, సుస్థిరంగా జీవించడం, పర్యావరణంపై తక్కువ ప్రభావం కలుగచేసే ప్రయత్నం జరుగుతూ ఉంటుంది. సేంద్రీయంగా పంటలు పండించడం, సేంద్రీయంగా ఉత్పత్తులను తయారుచెయ్యడం మరియు జీవావరణహితమైన, సుస్థిరమైన జీవనశైలి వంటి అంశాలలో వీరు తమకున్న పరిజ్ఞానాన్ని, అనుభవాన్నీ ఒకరితో ఒకరు పంచుకుంటూ ఉంటారు. ఈ అతిధేయ క్షేత్రాలు తినడానికి మంచి ఆరోగ్యకరమైన భోజనం మరియు ఉండడానికి సురక్షితమైన, పరిశుభ్రమైన ప్రదేశాన్నీ ఇస్తాయి. వాలంటీర్లు రోజుకు 4-6 గంటలు పొలంలో పనిచేసి తద్వారా ఆచరణాత్మకంగా అనుభవాన్ని పొందుతారు.

## ఇంటర్న్‌షిప్ ప్రోగ్రాం (శిక్షణాకాలంలో మలిదశ కార్యక్రమం)

సేంద్రీయ వ్యవసాయం, సుస్థిరత మరియు పర్యావరణ సంబంధిత అంశాలలో పరిశోధనా కార్యక్రమాలు నిర్వహించాలనుకునే విద్యార్థులకు ఒక ప్రోత్సాహకరమైన వాతావరణం మరియు నైపుణ్య, విద్యాసంబంధ వనరుల నెట్వర్క్‌ను కల్పించే లక్ష్యంతో డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా ఇంటర్న్‌షిప్ కార్యక్రమం



అతిధేయ క్షేత్రాలలో తమ ప్రాజక్టులను అమలుచేసుకున్న ఇంటర్న్ విద్యార్థులు

రూపొందించబడింది. ఈ కార్యక్రమంలో పాల్గొనే ఇంటర్న్‌లు ఎక్కువగా వివిధ దేశాలలోని, వివిధ విశ్వవిద్యాలయాలలో చదువుకుంటున్న చివరి సంవత్సరపు విద్యార్థులు.

డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా ఇంటర్న్‌షిప్‌లు ప్రాజక్టులపై ఆధారపడి ఉంటాయి. వీటిని వ్యక్తిగతంగాకీనీ, బృందాలుగా కానీ చేపట్టడం జరుగుతుంది. వారి ప్రాజక్టులను వారికివారే పరిశోధన, ప్రణాళిక రచన చేసుకుని వారే నిర్వహించాలనుకునేవారికి 12 వారాలకన్నా ఎక్కువ నిడివి ఇంటర్న్‌షిప్‌లు అనువుగా ఉంటాయి. డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా సలహాదారులు సూచించిన ప్రాజక్టును అధ్యయనంచేసి, నిర్వహించాలనుకునేవారికి 4 మరియు 8 వారాల ఇంటర్న్‌షిప్‌లు పనిచేస్తాయి.

ఈ ఇంటర్న్‌షిప్‌లలో మూడు దశలు ఉంటాయి. మొదటి దశ (ఫేస్ 1) భావజాలాన్ని అర్థంచేసుకోవడం మరియు నేపథ్య దృష్టిని అలవరచుకోవడం, అంటే వారు అధ్యయనం చెయ్యబోయే అంశం గురించి తెలుసుకోవడం మీద దృష్టి పెడుతుంది. ఇంటర్న్‌షిప్ ప్రక్రియ గురించి, డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా అతిధేయులతో ఇంటర్న్‌లు అర్థవంతమైన మరియు ఫలదాయకమైన సంబంధాలు ఏర్పరచుకోవడంతో ఈ దశ ఇంటి దగ్గరే మొదలవుతుంది. ఈ సమయంలోనే వారు చేపట్టబోయే ప్రాజక్టులను గుర్తించడం కూడా జరుగుతుంది. రెండవ దశ (ఫేస్-2)లో విద్యార్థులు వారు ఎంచుకున్న ప్రాజక్టుకు సంబంధించి మరింత లోతుగా అధ్యయనం చేసేందుకు కేటాయించడం జరుగుతుంది. దీనిమీద అభిప్రాయ సేకరణకు, నిర్మాణాత్మకమైన విమర్శలను అందుకోవడానికి మధ్యంతర సమీక్షలు కూడా జరుపబడతాయి. చివరగా ప్రాజక్టు ప్రతిపాదనపై ఒక వివరణ సమర్పించడంతో ఇక అధ్యయనం ముగిసి, ఆచరణ మొదలౌతుంది.

మూడవ దశ (ఫేస్ 3)లో ఇంటర్న్‌షిప్ తీసుకున్న విద్యార్థులు

వారి వారి ప్రాజక్టులను అతిథేయ క్షేత్రాలలో మొదలుపెడతారు. కొంతమంది విద్యార్థులను డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. గ్లోబల్ విలేజ్ (ప్రపంచ గ్రామాలు)లలో కూడా ఉంచడం జరుగుతుంది. సేంద్రీయ పద్ధతులలో నర్సరీల పెంపకం, చెక్‌డ్యాముల నిర్మాణం, నర్సరీలకొరకు షేడెడ్ బెడ్స్ (నీడన చేసిన మడులు) నిర్మాణం, కంపోస్టు తయారీ యూనిట్ల నిర్మాణం వంటి వివిధ కార్యక్రమాలలో ఆ చుట్టుపక్కల గ్రామాలలోని రైతులతోబాటు వాలంటీర్లు, ఇంటర్న్ విద్యార్థులు కూడా పాల్గొంటారు.

ఈ ఇంటర్న్‌షిప్‌కాలం పూర్తయ్యేనాటికి, విద్యార్థులు, గడచిన మూడు దశలలో వారు రూపొందించిన భావాత్మక, ఆచరణాత్మక మరియు పరిశోధనాత్మక పాఠ్య ప్రణాళిక ఆధారంగా నిర్వహించి పూర్తిచేసిన ప్రాజక్టును అప్పచెప్పాల్సి ఉంటుంది. ప్రాజక్టుకు సంబంధించిన వివరాలను తొలి దశ నుండీ చివరివరకూ రాసి ఉంచుకోవడం కూడా ఎంతో అవసరం. ఇది ఆ విద్యార్థికి, ఆ కార్యక్రమానికీ కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. ఇంటర్న్‌షిప్ ప్రాజక్టు పూర్తయ్యాక డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా వారు, ఆ విద్యార్థి నేర్చుకున్న, సాధించిన అంశాలను ప్రధానంగా ప్రస్తావిస్తూ ఒక ధృవీకరణ పత్రాన్ని అందచేస్తారు.

## ఇప్పటి వరకూ సాగిన ప్రయాణం

డబ్ల్యు.డబ్లు.ఓ.ఓ.ఎఫ్. ఇండియాలో చేరుతున్న వాలంటీర్లు, ఇంటర్న్‌షిప్ విద్యార్థుల సంఖ్య ఏటేటా పెరుగుతూనే ఉంది. సేంద్రీయ పద్ధతులలో వారి పరిజ్ఞానం ఎంతో పెరిగింది.

ఉదాహరణకి వారికిపుడు పంట మార్పిడి, తట్టుకునే రకాలు, కంపోస్టు తయారీ, మిశ్రమ పంట విధానం, దుక్కిలేని వ్యవసాయం, చీడపీడల నివారణ, పచ్చిరొట్ట ఎరువులు, మల్చింగ్, పోషక చక్రాలు, వనరుల పునరుపయోగం వంటి ఆచరణ పద్ధతులపై వారికి మంచి అవగాహన ఉంది. పరిశీలన, నిరోధించడం మరియు పర్యవేక్షణ అన్న సూత్రాల ఆధారంగా చీడపీడల నిర్వహణా వ్యవస్థను రూపొందించి అమలుచేశారు. సేంద్రీయ ఉత్పత్తుల తయారీ విధానాలలోని మెళకువలను తెలుసుకున్నారు. సేంద్రీయేతర పదార్థాలు, సేంద్రీయేతర ఉత్పత్తులు కలుషితం అయ్యే అంశాలు చర్చించారు. డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా అతిథేయ రైతులు పండించి మార్కెట్ చేసే మార్కెట్ల గురించి కూడా ఇప్పుడు వారు అవగాహన పెంచుకున్నారు. వారిప్పుడు డైరెక్ట్ మార్కెటింగ్ (నేరుగా సరుకును అమ్మడం), రైతు బజార్లు, ప్రత్యేకమైన షాపులు, రీటైలర్లు వంటి వివిధ మార్కెటింగ్ చానళ్ళను గుర్తించి, వాటి యొక్క గుణగణాలను తెలుసుకోగలరు. అంతేకాక ధృవీకరణ ప్రక్రియను కూడా అర్థంచేసుకునే అవకాశం వారికి లభిస్తుంది. ఎగుమతి మార్కెటింగ్ కొరకు వ్యూహరచన చేసేటప్పుడు ఏ ఏ అంశాలు పరిగణనలోనికి తీసుకోవాలి అన్నది కూడా వారికి అర్థమౌతుంది.

వాలంటీర్లను వారి క్షేత్రాలతో అనుసంధానం చెయ్యడం ద్వారా, డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా ఎంతోమంది రైతులు సేంద్రీయ వ్యవసాయానికి మారేందుకు తోడ్పడింది. ఈ క్రమంలో వారు దేశవ్యాప్తంగా 50కి పైగా కొత్త సేంద్రీయ అతిథేయ క్షేత్రాలను వారి నెట్వర్కులో చేర్చుకున్నారు. రాబోయే 5 సంవత్సరాలలో, డబ్ల్యు. డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా 5000 మంది వాలంటీర్లకు, 200 మంది ఇంటర్న్ విద్యార్థులకు వివిధ ప్రాజక్టులలో స్థానం కల్పించి, వారు సేంద్రీయ వ్యవసాయం నేర్చుకునేందుకు మరొక 1000 సేంద్రీయ క్షేత్రాలను ఈ నెట్వర్కులో చేర్చుకునే సంకల్పంతో ఉంది. అతిథులను, వాలంటీర్లను దగ్గరకు చేర్చి, వారి నడుమ వారధిలా వ్యవహరిస్తోంది డబ్ల్యు.డబ్ల్యు.ఓ.ఓ.ఎఫ్. ఇండియా సంస్థ. వీరంతా మరింత సుస్థిరమైన జీవనాన్ని కొనసాగించేందుకు, మరింత ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని కల్పించడానికి ఒకరికొకరు సాయపడుతూ ఉంటారు. ఈ ప్రక్రియలో సంస్కృతిని పంచుకోవడం కూడా ప్రాధాన్యత వహిస్తుంది.

గత 5 సంవత్సరాలలో, యూరోపియన్ యూనియన్ మరియు యు.ఎస్.ఏ. దేశాలలోని వివిధ విశ్వవిద్యాలయాల నుండి వచ్చిన 2000 మందికి పైగా వాలంటీర్లు మరియు 15 మంది ఇంటర్న్‌లు సేంద్రీయ వ్యవసాయంలో శిక్షణ పొందారు. ◆

**Harish Tewari**
Director, WWOOF India, A-46 Judge Farm, Haldwani, Nainital, Uttarakhand, India
E-mail: sewa1@rediffmail.com www.wwoofindia.org

**Poonam Tewari**
Junior Scientist, College of Home Science,
G.B.P.U.A. & T, Pantnagar University, Uttarakhand, India.

ఆంగ్లమూలం :

లీసా ఇండియా సంపుటి 15, సంచిక 3 సెప్టెంబర్ 2013



కోళ్ళ పెంపకానికి పొలంలోని కొలనులో ఏర్పాటుచేసిన పాక

# కుటుంబ సేద్య క్షేత్రాలు ఉత్పత్తిదాయకం, సుస్థిరం

**ఆర్.మణికందన్, సుభాషిణి శ్రీధర్, ఆర్. అబర్న తూయవతి మరియు కె.విజయలక్ష్మి**

**ఒక వ్యవస్థలో 'సెల్ఫ్ రిప్లికేటింగ్ సైకిల్స్' (స్వయం ప్రతి సృజనీయ మండలాలు) నెలకొల్పడం ద్వారా వనరులను, కాలాన్ని, శక్తిని సమర్ధవంతంగా వినియోగించడం సాధ్యపడుతుంది. మొక్కల మరియు జంతుజాతులను జాగ్రత్తగా ఎంచుకోవడం ద్వారా, స్థలాన్ని, వనరులని కట్టుదిట్టంగా వినియోగించుకోవడం ద్వారా, మరియు సమర్ధవంతమైన పునరుపయోగ ప్రక్రియల ద్వారా ఆ వ్యవస్థకు స్థిరత్వాన్ని మరియు స్థితిస్థాపకత (తిరిగి కోలుకోవడం)ను కలుగజేయడమేకాక రైతులు వారి క్షేత్రాలనుండి వచ్చే ఆదాయాన్ని కూడా పెంచుకోవచ్చు. తమిళనాడుకు చెందిన శ్రీ తిలగర్ అన్న రైతు ఈ విషయాన్ని నిరూపించారు.**

తమిళనాడులోని, నాగపట్టిణం జిల్లా, సిర్ ఖాజీ తలూకాలో ఉన్న నెమ్మెలి గ్రామానికి చెందిన శ్రీ తిలగర్ అన్న రైతు తన జీవనోపాధికి తన 7 ఎకరాల భూమి మీదే ఆధారపడతారు. ఆయన 2002 నుండి సుస్థిర పద్ధతులలో ఆహారాన్ని ఉత్పత్తి చెయ్యడంలో తన ప్రయోగాలు మొదలుపెట్టారు. ఆయన వ్యవసాయంలో రసాయనాల వాడకాన్ని బాగా తగ్గించారు. అయితే సేంద్రీయ వ్యవసాయ పద్ధతులలో నిరంతర మార్గదర్శకత్వం, సలహాలు అందించేవారు లేక, రసాయనాలు పూర్తిగా మానెయ్యడానికి అతనికి ధైర్యం సరిపోలేదు. వ్యవసాయం ఒక్కటే ఆదాయ మార్గం కావడంతో అతడు అంత పెద్ద ప్రయోగం చెయ్యడానికి ఇష్టపడలేదు.

## పొలంలో జీవ వైవిధ్యాన్ని పెంచిపోషించడం

అసలు రసాయనిక వ్యవసాయం నుండి సేంద్రీయ వ్యవసాయానికి మారడం అన్నది 2006లో అతను సి.ఐ.కె.ఎస్. వారి రైతు

బృందంలో చేరినప్పుడు మొదలైంది. సి.ఐ.కె.ఎస్. అన్నది సుస్థిర వ్యవసాయ మరియు అనుబంధ టెక్నాలజీలు ప్రోత్సహించడం ద్వారా రైతులకు సార్థకతను కూర్చే ఒక ప్రభుత్వేతర సంస్థ. మొక్కలు, జంతువులు, ప్రకృతి అంటే అమితమైన ప్రేమ ఉన్న తిలగర్, మొదట్లో తన వ్యవసాయాన్ని కేవలం వరి, మినుము, పెసలు మరియు కూరగాయపంటలకే పరిమితం చేసాడు.

''స్థానిక పరిస్థితులకు అనువుగా మారిన సాంప్రదాయ రకాల విత్తనాలే రైతులకు నిజమైన సంపద. సాధ్యమైనన్ని సాంప్రదాయ రకాల విత్తనాలు పరిరక్షించడం ప్రతి రైతు యొక్క కర్తవ్యం'' అంటారు తిలగర్. ఈ సాంప్రదాయ విత్తనాల పరిరక్షణ కొరకు ఆయన తన పొలంలో నాలుగు రకాల సాంప్రదాయ వరి రకాలను పండిస్తారు - సీరగ సాంబ, మాప్పిళ్ళై సాంబా, తంగ సాంబా మరియు తూయమల్లి. అయితే వాణిజ్యపరంగా పండించడానికి ఆయన తలాడి (రబీ) సీజనులో వైట్ పొన్ని మరియు కురువై (ఖరీఫ్) కాలంలో ఎ.డి.టి. - 43 పండిస్తారు. సగటున ఆయనకి ఖరీఫ్‌లో రూ.1.26 లక్షలు మరియు రబీలో రూ.1.50 లక్షల ఆదాయం వస్తోంది. రబీలో వరి తరువాత ఆయన ఆరు ఎకరాలలో మినుము పండించి రూ.50,000/- నికర ఆదాయాన్ని పొందుతారు. ఆయన తన ఉత్పత్తిని సిర్‌ఖాజీలోని సిర్‌ఖాజీ ఆర్గానిక్ ఫార్మర్స్ అసోసియేషన్ అన్న సేంద్రీయ రైతుల సంఘంలో అమ్ముతారు. ఇక్కడ ఆయనకు మార్కెట్ ధర కన్నా మంచి ధర వస్తుంది.

ఒక 5 సెంట్ల భూమిలో అతను అనేక రకాల కూరగాయలు పండిస్తారు. సగటున రోజూ ఆయన 5 కిలోల కూరగాయలను పండించి అమ్ముతారు. సంవత్సరానికి దాదాపు రూ.18,000/- సంపాదిస్తారు. అంతేకాక, ఆయన పొలంలో మామిడి, జామ, సపోటా, దానిమ్మ, మునగ, కొబ్బరి, ఉసిరి, అరటి, బొప్పాయి, మరియు నిమ్మ వంటి పండ్ల చెట్లు ఉన్నాయ. వీటితో పాటు ఆయన పొలంలో టేకు, గ్లైరిసిడియా, సుబాబుల్, వేప వంటి బహుళ-ప్రయోజనకర వృక్షాలు కూడా ఉన్నాయి. పొలం సరిహద్దుల్లో చీడపీడల నివారణకు ఉపయోగపడే జిల్లేడు, వస, అక్షింతల పూలు, నల్లేరు వంటి మొక్కలు పెంచాడు.

## పొలంలోని వివిధ అంశాలను జోడించడం

సేంద్రీయ వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తిలగర్ తన పొలంలోని పంటలు, కూరగాయలు, చెట్ల ద్వారా మంచి ఫలసాయం పొందేవాడు. అయినప్పటికీ సుస్థిరత పట్ల అతనికి ఉన్న ఉత్సాహం వలన అతడు పంటల సాగు, కూరగాయల పెంపకం, కోళ్ళ పెంపకం, చేపలు, పశువులు మరియు మేకల పెంపకం వంటి అన్ని రకాల అంశాలూ కలిగి ఉన్న సమగ్ర క్షేత్రాన్ని రూపొందించాడు. అతడు తన క్షేత్రంలో వివిధ అంశాలను ఏ విధంగా చేర్చుకున్నాడో, ఎలా వివిధీకరించాడో తెలుసుకోవడం చాలా ఆసక్తికరంగా ఉంటుంది. వరిమళ్ళకు నీరు కొత్తగా తవ్విన బోరుబావి నుండి వస్తుంది. ఈ నీరు పరీక్ష చేసి చూస్తే, ఆ నీరు ఉప్పు గుణం కలిగి, వరిపంటకు నష్టం కలిగిస్తున్నట్లుగా తెలిసింది. నెమ్మలి గ్రామం తీరానికి 25 కి.మీ. దూరంలో ఉండడం వలన, ఆ ప్రాంతంలో కొన్ని సంవత్సరాలుగా బోరుబావుల ద్వారా నీరు తోడేస్తూ ఉండడం వలన అక్కడి భూగర్భజలం ఉప్పగా మారింది.

*తన క్షేత్రంలో వివిధ అంశాలను చేర్చడం ద్వారా, ఒక అంశం యొక్క ఉత్పత్తి మరొకదానికి ఉత్పాదకంగా మారే విధంగా తిలగర్‌గారు జాగ్రత్త తీసుకోవడంతో పొలంలోని వివిధ అంశాలు చక్కగా ఏకీకృతం అయ్యాయి.*

ఈ నీటిని శుద్ధిచేసి అందులోని లవణగుణాన్ని తగ్గించడానికి సిర్‌ఖాజీలోని వ్యవసాయ ఇంజనీరింగ్ శాఖ వారు అందించిన సబ్సిడీ సహాయంతో తిలగర్ ఒక ఫార్మ్ పాండ్‌ను తవ్వించారు. బోర్‌వెల్‌లోని నీరు ముందుగా ఫార్మ్ పాండ్‌లో నింపి, రెండు రోజుల తరువాత వరి మళ్ళకు నీరు పెట్టేలా ఏర్పాటుచెయ్యడం జరిగింది. ఈ ఏర్పాటు మంచి ఫలితాన్నిచ్చింది.

ఇలా పొలంలోనే చెరువు ఉండడంతో చేపల పెంపకానికి ఇది ఎంతో అనువుగా తయారయ్యింది. అందువలన తిలగర్ కాట్లా, మృగల్, రోహు వంటి 5 వేర్వేరు రకాల చేపలతో చేపల పెంపకం మొదలుపెట్టారు. ఆయన ఈ చేపలకు రోజూ 1 కిలో అజోల్లా నాచు తప్ప ప్రత్యేకంగా ఏ ఇతర ఆహారం ఇవ్వరు. ప్రతి యేటా, ఆయన ఈ చెరువులో 1000 చేపపిల్లలను వదులుతారు. సగటున ఏడాదికి అతను 750 కిలోల చేపలు పట్టి, కిలో రూ.100/- చొప్పున అమ్ముతారు. ఆ విధంగా తిలగర్ తన కృషితో ఒక అవరోధాన్ని అవకాశంగా మలచుకున్నారు.

చెరువులో ఒక అయిదు అడుగుల ఎత్తులో 10x10x8 అడుగుల పాక నిర్మించి అందులో 14 దేశీ కోళ్లు, 18 వైట్ లెగాన్ కోళ్ళు పెంచారు. వరి, చిరుధాన్యాలు, వరిపొట్టు వంటి పంట ఉత్పత్తితోనే కోళ్ళమేత తయారుచేస్తారు. వాటితోపాటు అవిశ, మునగ ఆకులు మరియు అజోల్లా కూడా ఈ కోళ్ళకు మేతగా ఇచ్చారు. కోడి గుడ్లు, కోళ్ళు, అమ్మడం ద్వారా అతను సంవత్సరానికి రూ.10000/- ఆదాయం పొందాడు. చెరువులోకి నేరుగా కిందికి పడే కోళ్ళ పెంట చేపలకి పోషకాలను అందించడంతోబాటు నీటి పారుదలకు ఉపయోగించే ఆ నీటిని కూడా సారవంతం చేస్తుంది.

తిలగర్ గారి పొలంలో కొన్ని దేశీ ఆవులు, సంకరజాతి ఆవులు కూడా ఉన్నాయి. ఆవు పేడ వానపాము ఎరువు మరియు బయోగ్యాస్ ఉత్పత్తికి వాడబడుతుంది. బయోగ్యాస్ ప్లాంట్ నుండి వెలువడిన 'స్లర్రీ', పశువుల కొట్టంలోని వ్యర్థ జలం మరియు ఆవు మూత్రం చెరువులోకి వదిలిపెట్టడం ద్వారా సాగునీరు సారవంతం చెయ్యడంతోబాటు ఆ చెరువులోని చేపపిల్లలకు

పోషకాలు అందించడం కూడా జరుగుతుంది. ఈ ఆవులు రోజుకి 10-13 లీటర్ల పాలను ఇస్తాయి. గృహావసరాలు పోగా మిగిలిన పాలను లీటరు 20/- చొప్పున అమ్మడం జరుగుతుంది.

ఎత్తుగా అమర్చిన బోను/పంజరంలో తిలగర్‌గారు 'తలచేరీ' జాతివి 6 మేకలు, 10 మేక పిల్లలు పెంచారు. ఇలా ఎత్తుగా అమర్చిన పంజరాలను ఉపయోగించడం వలన మేకలు భద్రంగాను, ఆరోగ్యంగానూ కూడా ఉంటాయి. మేక పెంట పొలంలోని చెట్లకి ఎరువుగా వెయ్యడం జరుగుతుంది. మేకలను, మేక పిల్లలను అమ్మడం ద్వారా అతనికి సంవత్సరానికి రూ.50,000/- ఆదాయం వస్తుంది.

చెరువుగట్టు మీద పశుగ్రాసపు గడ్డి నాటించారు - ఇది రెండు ప్రయోజనాలను చేకూరుస్తుంది. పొలం గట్లను స్థిరీకరించడం మరియు పశుగ్రాస ఉత్పత్తి. తిలగర్ గారు కో.3, కో.4, గ్లైరిసిడియా, అవిశ వంటి పశుగ్రాస పంటలు సేంద్రీయంగా పండించి పశువులకు మేపుతారు. ఇందువలన పశువులు ఆరోగ్యంగా ఉంటాయి.

## సుస్థిరత ఉండేలా చూడడం

తన క్షేత్రంలో వివిధ అంశాలను చేర్చడం ద్వారా, ఒక అంశం యొక్క ఉత్పత్తి మరొకదానికి ఉత్పాదకంగా మరే విధంగా తిలగర్‌గారు జాగ్రత్త తీసుకోవడంతో పొలంలోని వివిధ అంశాలు చక్కగా ఏకీకృతం అయ్యాయి. పంట వ్యర్థాలు, గట్ల మీద పెంచిన పశుగ్రాసం పశువులకు మేతగా పనికివస్తుంది. పశువుల పేడ ఎరువుగా మార్చి తిరిగి పొలంలోకే చేర్చబడుతుంది. ఈ విధంగా కొన్ని సంవత్సరాలు వరసగా వివిధ సేంద్రీయ ఎరువులు, వెర్మీకంపోస్ట్, జీవన ఎరువులు, పంచగవ్య, పచ్చి రొట్ట పైరులు, మల్చింగ్ వంటివి వేయడం వలన నేల నాణ్యతలో గణనీయమైన మెరుగుదల వచ్చింది. ఇది ఆ పంట ఉత్పత్తిలో వచ్చిన పెరుగుదలను బట్టే స్పష్టం అవుతుంది. క్రమంగా అతను తన పొలంలో పెట్టే పెట్టుబడి తగ్గుతూ వచ్చింది. ఎందుకంటే అతడు ఉపయోగించే ఉత్పాదకాలు చాలా వరకూ అతని పొలంలోనివే. తిలగర్ గారి పొలం అచ్చమైన కుటుంబ సేద్య క్షేత్రం (ఫ్యామిలీ ఫార్మ్). వ్యవసాయానికి ముఖ్యంగా అవసరమైన విత్తనాలూ, భూసారాన్ని కాపాడేందుకు అవసరమైన ఉత్పాదకాలూ, చీడపీడల నివారణకు ఉపయోగించే ఉత్పాదకాలూ అన్నీ అతని పొలంలోనే ఉత్పత్తి అవుతాయి. అంతేకాక, అతని పొలంలో పనులన్నీ, అతని కుటుంబ సభ్యులే నిర్వహిస్తారు. ఉదాహరణకి అతని భార్య శ్రీమతి కర్పగం అతడికి వానపాము ఎరువు తయారీలో, జీవ కీటక నాశినుల తయారీలో, పశుపోషణలో సహాయం చేస్తూ, అతడు చేస్తున్న ప్రతి పనిలో చేదోడు వాదోడుగా ఉంటుంది. వీరి పొలంలో ఎంతో పునరుపయోగ ప్రక్రియ జరుగుతూ ఉంటుంది. దీనివలన బయటి ఉత్పాదకాల మీద ఆధారపడడం అన్నది చాలా తగ్గిపోయింది. తన కుటుంబం సహాయంతో నిర్వహించుకోగలుగుతూ, పంట ఫలసాయాన్ని, సంవత్సరానికి లక్ష రూపాయల ఆదాయాన్ని అందిస్తున్న పొలం ఉన్న తిలగర్ ఈరోజు తనని తాను ఒక 'రైతు'గా అనుకోవడానికి గర్విస్తారు.



సమగ్ర వ్యవసాయ పద్ధతుల గురించి రైతులతో మాట్లాడుతున్న తిలగర్

పొలంలో వివిధ అంశాలు చేర్చడం ద్వారా, ఒక అంశం యొక్క ఉత్పాదన మరొకదానికి ఉత్పాదకంగా ఉపయోగపడే విధంగా చూడడం జరిగింది. ఈ విధంగా తిలగర్ గారు అతని క్షేత్రం లోని వివిధ అంశాలనూ చాలా చక్కగా, చాలా సమర్ధవంతంగా జోడించారు. ◆

**R. Manikandan, Subhashini Sridhar,**
**R. Abarna Thooyavathy and K.Viayalakshmi**
Centre for Indian Knowledge Systems, No.30,
Gandhi Mandapam Road, Kotturpuram,
Chennai - 600085 E-mail : cikskazhi@gmail.com

ఆంగ్లమూలం :

లీసా ఇండియా సంపుటి 15, సంచిక 4 డిసెంబర్ 2013

# సాంప్రదాయ వరి పునరాగమనం

సీమ జి. ప్రసాద్

**సహజ సమృద్ధ అన్న సేంద్రీయ రైతు సంఘం ఒక దశాబ్దం క్రితమే, సుస్థిర వ్యవసాయం గురించిన ఆలోచనలు, విత్తనాలు, పరిజ్ఞానం ఇచ్చిపుచ్చుకోవడానికి ఒక రైతు బృందాన్ని ఏర్పాటు చేసింది. చిన్నగా మొదలైన ఈ బృందం ఇప్పుడు ఒక చైతన్యవంతమైన సంస్థగా ఎదిగి సాంప్రదాయ, దేశీయ విత్తనాలను పునరుద్ధరించే ప్రవర్ధమాన వుద్యమాన్ని నడిపిస్తోంది.**

వరుసగా రెండు రోజులు, అసలు విరామమే లేకుండా 'రైస్ మేలా' (వరిజాతర) లో మాట్లాడి, మాట్లాడి అలసిపోయిన గొంతుకలతో ఉన్న మాలో ఎవ్వరికీ ఇంక ఆ రోజు మాట్లాడే ఓపిక మిగలలేదు. కానీ రెండో రోజుకల్లా, రైతులు నేరుగా వారికి వారే స్వయంగా అమ్మకానికి పెట్టిన బియ్యం మొత్తం అమ్ముడుపోయింది. ఇంకా ఈ ఉత్సవం ముగియడానికి మరో రోజు ఉంది. ఈ బియ్యం కొనడానికి వచ్చిన ఎంతోమంది, కనీసం ఒక కిలో కూడా దొరకక, అక్కడ ప్రదర్శనకు ఉంచిన దాదాపు 100 రకాల బియ్యపు రకాలనీ, పంట గురించిన సమాచారాన్ని అందించే పోస్టర్లనూ, కర పత్రాలనూ ఆసక్తిగా చూస్తూ అక్కడి రైతులతో మాట్లాడి, ఖాళీ సంచులతో వెనుదిరిగి వెళ్ళిపోయారు.

## సేంద్రీయమే జీవితం

'సహజ సమృద్ధ' అనే రైతుల సంస్థ సాంప్రదాయ వరి రకాలపై అవగాహన పెంచి, విత్తనాలను మరియు సుస్థిర వ్యవసాయం గురించిన సమాచారాన్నీ పంచుకనే వేదికను ఏర్పాటు చేసే ఉద్దేశ్యంతో మేళా (జాతర)లను నిర్వహిస్తూ ఉంది. చిన్న, సన్నకారు రైతులు, మహిళా బృందాలు, మరియు విత్తనాలు సేకరించేవారితో ఏర్పడ్డ ఈ సాముదాయిక సంస్థ ఒక దశాబ్దం ముందు ఏర్పడింది. ప్రధానంగా సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న 750మంది రైతులు, మరియు రైతు బృందాలు ఈ సంస్థలో నమోదు కాబడి ఉన్నాయి.

సేంద్రీయ వ్యవసాయంలో మేము చేస్తున్న కృషితో బాటు, సాంప్రదాయ వరి గురించిన సంస్కృతిని, పరిజ్ఞానాన్ని ఆసియా ఖండమంతా వ్యాప్తి చేసే లక్ష్యంతో పనిచేసే 'సేవ్ అవర్ రైస్ కాంపైన్' (మన వరిని కాపాడే ఉద్యమం) అన్న ఒక అఖిల-ఆసియా ఉద్యమాన్ని కూడా మేము చేపట్టడం జరిగింది. పొలాలలో ఉన్న వరి వైవిధ్యాన్ని పరిరక్షించడం, భాగస్వామ్య పద్ధతిలో పంటను



సాంప్రదాయ వరి రకాలు

అభివృద్ధిపరచడం మరియు సాంప్రదాయ వరిని ప్రాచుర్యంలోకి తేవడం వంటి కార్యక్రమాలతో కర్ణాటక రాష్ట్రంలో ఈ ఉద్యమాన్ని సహజ సమృద్ధ సంస్థ నడిపిస్తోంది.

## 'సేవ్ అవర్ రైస్ కాంపైన్' (మన వరిని కాపాడే ఉద్యమం)

కర్ణాటక రాష్ట్రంలో సేంద్రీయ వరి సాగు ఊపందుకుంటోంది. మామూలుగా చేసే వ్యవసాయంకన్నా సేంద్రీయ వరి సాగు మంచి లాభసాటి ప్రత్యామ్నాయం అన్న విషయాన్ని చాలామంది రైతులు తెలుసుకున్నారు. వీటిలో కొన్ని రకాలు, అద్భుతమైన రుచి, బెట్ట, తెగుళ్ళు, లావణీయత వంటివి తట్టుకునే శక్తి, ఆరోగ్యపరమైన ప్రయోజనాలు, వండడానికి అనువైన లక్షణాలు మరియు ఇతరమైన ప్రత్యేకమైన లక్షణాలు కలిగి ఉన్నందున, ఇప్పటికీ కొన్ని మారుమూల ప్రాంతాలలో సాగుబడిలో ఉన్నాయి. ఆరోగ్యప్రదమైన వరి రకాలలో, కరిబట, కలావె, కరి కలావె, దొడ్డబైర నెల్లు, కరి గిజివిలి మరియు సన్నక్కి రకాలు ప్రముఖమైనవి.

అయితే సాంప్రదాయ వరి రకాలను మార్కెటింగ్ చేయడం ఒక సవాలుగా మిగిలిపోయింది, ముఖ్యంగా పట్టణాలలో. వీటి గింజల రంగు, పరిమాణం కారణంగా పట్టణవాసులు వీటిని కొనడానికి మొగ్గు చూపించరు. రూఢి అయిన మార్కెట్ అవకాశం లేనందున రైతులు వాటిని పండించడానికి ముందుకు రాలేదు.

అందువలన వివిధ రకాల వరిని మార్కెటింగ్ చేసే బాధ్యత మేము తలకెత్తుకున్నాము. ఈ సాంప్రదాయ వరి రకాలకు సంబంధించిన సాంప్రదాయ విజ్ఞానాన్ని సేకరించి, వాటి పోషక

## సహజ ఆర్గానిక్స్ - రైతులే స్వంతదారులుగా ఉన్న కంపెనీ

'సహజ ఆర్గానిక్స్' అన్న బ్రాండ్ పేరిట సహజ ఆహారాన్ని సేకరించి, మార్కెట్ చెయ్యడానికి సహజ సమృద్ధ సంఘం వినియోగదారులు మరియు ఉత్పత్తిదారులతో కూడిన ఒక నెట్వర్క్ అభివృద్ధి చేసింది. సహజ సమృద్ధ ఆర్గానిక్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ అన్నది సేంద్రీయ ఉత్పత్తిని మార్కెట్ చెయ్యడానికి ఏర్పాటు చెయ్యబడింది. ఈ ప్రొడ్యూసర్ (ఉత్పత్తిదారుల) కంపెనీ ఉత్పత్తిని నేరుగా రైతుల వద్దనుండి కొని ఈ నెట్వర్క్‌లోని ఔట్‌లెట్లకు (విక్రయ కేంద్రాలు) సరఫరా చేసే ఏర్పాటు చేస్తుంది. ఉత్పత్తి నేరుగా వినియోగదారులకి చేరడానికీ, రైతులకు మంచి ధర ముట్టేలా చెయ్యడానికీ ఈ గొలుసు ఏర్పాటు జరిగింది.

సహజ ఆర్గానిక్స్ అనేక రకాల ఉత్పత్తులను మార్కెటింగ్ చేస్తుంది - 30 రకాల వరి, 15 రకాల వివిధ చిరుధాన్యాలు, గోధుమ, పప్పు ధాన్యం, పండ్లు మరియు కూరగాయలు, చంటి పిల్లల ఆహారాలు, అప్పడాలు, ఆరోగ్య పానీయాలు, మల్టీగ్రైన్ (వివిధ ధాన్యాలు కలగలిపిన) పిండి, విలువ వృద్ధి పరచిన ఉత్పత్తులు మరియు తినడానికి సిద్ధంగా ఉన్న ఆహారాలు. సహజ సమృద్ధ కేవలం సేంద్రీయ మరియు సాంప్రదాయ వరి, చిరుధాన్య, పప్పుధాన్య పంటలను మాత్రమే ప్రోత్సహిస్తుంది. మంచి పోషక విలువలు, ఔషధ విలువలు కలిగిఉన్న కారణంగా, ఈ పంటలు, ముఖ్యంగా చిరుధాన్యాలు మరియు ఎర్రబియ్యం, పట్టణ ప్రాంతాలలో అధిక గిరాకీ కలిగి ఉన్నాయి.

ప్రస్తుతం ఈ కంపెనీలో, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 786 సేంద్రీయ ఉత్పత్తిదారులు మరియు ఆర్గానిక్ 'కన్వర్షన్ స్టేటస్' (సేంద్రీయ పద్ధతులలోకి మారుతూ ఉన్న) కల 2000లకు పైగా రైతులు ఉన్నారు. దక్షిణ భారతదేశం లోని ముఖ్యమైన పట్టణాలలో ఏర్పాటైన 26 ఔట్ లెట్లకు విస్తృతశ్రేణిలోని సేంద్రీయ ఉత్పత్తులను ఈ సంస్థ క్రమం తప్పకుండా సరఫరా చేస్తోంది.

ఈ బయో ఎంటర్‌ప్రైజె విజయవంతమవ్వడానికి ముఖ్యమైన కారణం పౌర సమాజంతో భాగస్వామ్యం ఏర్పరచుకోవడం. రైతు సంఘాలు, మహిళా బృందాలు, వినియోగదారుల బృందాలు కలిసి ఒకే విధమైన దృక్పథం ఉన్న సంస్థతో కలిసి పనిచేస్తూ దక్షిణ భారతదేశంలో కనుమరుగైన వ్యవసాయ సంస్కృతిని, సమాచారాన్నీ పునరుద్ధరిస్తున్నాయి.

> సగటున ఒక్కో ప్రదర్శనను 4000 - 5000 మంది వినియోగదారులు సందర్శించారు. ఒక్కో మేళాలో దాదాపు 3 - 4 లక్షల రూపాయల విలువ ఉన్న సాంప్రదాయ వరి రకాలు అమ్ముడు పోయాయి.

విలువలను ప్రయోగశాలలో పరీక్ష చేయించాము. సాధారణంగా మార్కెట్‌లో లభించే పాలిష్ (పొట్టు తీసిన) చేసిన వరి రకాలతో పోలిస్తే, వీటిలో పోషక విలువలు అధికంగా ఉన్నట్లు, ఆరోగ్యానికి మేలు కలిగించే సుగుణాలు ఉన్నట్లు ఈ నివేదికలు తెలిపాయి.

ఈ ఫలితాలకు, మేము మా పోస్టర్లు, కరపత్రాలు, వ్యాసాల ద్వారా విస్తృతమైన ప్రాచుర్యాన్ని కల్పించాము. మీడియా ద్వారా కల్పించిన ప్రచారం వలన మరియు ఇటువంటి మేళాలు నిర్వహించడం వలన ఈ సమాచారం వ్యాప్తి చెంది, ఎంతోమంది సాంప్రదాయ వరికి మారే విధంగా ప్రభావితం చేసింది.

## మార్పుకు తెర తీసిన వరి ప్రదర్శన (రైస్ మేళా)లు

మరుగున పడిపోయిన ఈ సంపద యొక్క ఆరోగ్య ప్రయోజనాలను గురించి వినియోగదారులలోఅవగాహన కల్పించడానికీ, ఈ సాంప్రదాయ వరి యొక్క ప్రత్యేకమైన, అసాధారణమైన సువాసనను ప్రజలకు పరిచయం చెయ్యడానికీ వివిధ ప్రాంతాలలో వరి ప్రదర్శనలను నిర్వహించారు.

ఆర్గానిక్ మేళా, దేశీ రైస్ మేళా, రెడ్ రైస్ మేళా, బయోడైవర్సిటీ మేళా మరియు సేఫ్ ఫుడ్ మేళా అన్న వివిధ ఇతివృత్తాలతో మేము బెంగుళూరులోను మరియు ఇతర పట్టణాలలోను వరుసగా అనేక ప్రదర్శనలు నిర్వహించాము. సాంప్రదాయ వరి రకాల బియ్యంతో రుచికరమైన ఆహారం తయారుచేసి, వాటిని ఆకర్షణీయంగా ప్రదర్శించాము. ఈ విధంగా ఆరోగ్యకరమైన, పోషక విలువలున్న, మరుగున పడిపోయిన ఆహార ధాన్యాన్ని మార్కెట్‌లో తిరిగి ప్రవేశపెట్టడం జరిగింది.

సగటున ఒక్కో ప్రదర్శనను 4000 - 5000 మంది వినియోగ దారులు సందర్శించారు. ఒక్కో మేళాలో దాదాపు 3 - 4 లక్షల రూపాయల విలువ చేసే సాంప్రదాయ వరి రకాలు అమ్ముడు పోయాయి. 2012లో సాంప్రదాయ వరి రకాల అమ్మకాలు 100 టన్నులను దాటింది.

ఈ మేళాల గురించీ, ఉత్పత్తుల గురించీ భారీ ఎత్తున అవగాహన కలిగించడంలో మీడియా ప్రముఖ పాత్ర వహించింది. వివిధ వార్తాపత్రికలు, సచిత్ర పత్రికలు ఎర్రబియ్యం మరియు సేంద్రీయ వరి మీద ప్రత్యేక కథనాలు ప్రచురించాయి. మేము సందర్శకుల గురించిన సమాచారాన్ని కూడా సేకరించాము. ఇందువలన ప్రదర్శన ముగిసాక కూడా మేము వారిని చేరుకోగలిగాము.



రైస్ మేళాకు విచ్చేసిన సందర్శకులు

వినియోగదారులు, రైతు బృందాలతో కూడిన దాదాపు 30 ఇతర సంస్థలతో కలిసి సహజ సమృద్ధ నెలకొల్పిన నెట్వర్క్లో దేశవ్యాప్తంగా 2000కి పైగా పరిరక్షకులు, రైతు-బ్రీడర్లు (కొత్త రకాలను రూపొందించే రైతులు) 600కి పైగా సుగంధభరిత, ఔషధ గుణాలు కల, ముంపు పరిస్థితులకు అనువైన, లవణ గుణాన్ని తట్టుకునే, మెట్ట వరి (డ్రైలాండ్) రకాలను పరిరక్షించే పనిలో నిమగ్నమై ఉన్నారు. అయితే ఇది కేవలం ఆరంభం మాత్రమే. సేంద్రీయ ఆహారానికి, దేశీయ ధాన్యానికి ప్రాచుర్యం కల్పించడం ద్వారా మరింత మంది ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లలోకి మారేందుకు కృషి చెయ్యడమే మా లక్ష్యం. ◆

**Seema G Prasad**
State Coordinator,
Save Our Rice Campaign - Karnataka, No. 7, 2 Cross,
7th Main, Sulthan Plaza, Bangalore - 560 032.
Email : seemaprasadg@gmail.com

ఆంగ్లమూలం :

లీసా ఇండియా సంపుటి 15, సంచిక 2 జూన్ 2013